
# అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

The Pride of Telugu national daily


Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263

ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శనివారం 14-11- 2026 సంపుటి : 6 సంచిక : 267 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## విద్యార్థుల హాస్టళ్ల మూసివేతపై శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం



- హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి తీవ్ర విమర్శలు
- ఓయూ వసతి గృహాలకు నీరు, విద్యుత్ నిలిపివేతపై ఆగ్రహం
- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇబ్బందులు
- విద్యార్థులను బలవంతంగా ఇళ్లకు పంపడం సరికాదు
- ఆరు నెలల్లో 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

2లో

## గన్నవరం ఎయిర్‌పోర్టులో మాజీ మంత్రి తలసానికి ఘన స్వాగతం

- నవంబర్ 15 నుంచి 17 వరకు నామినేషన్ల స్వీకరణ
- నవంబర్ 18న నామినేషన్ల పరిశీలన
- నవంబర్ 19, 20 తేదీల్లో అప్పీళ్లకు అవకాశం
- నవంబర్ 21న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు
- అదే రోజు బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- నవంబర్ 26న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు



2లో

## మరో 25 ఏండ్ల తర్వాత బీజేపీ ఉనికి ఉండదు

పెట్టుబడుల ఆకర్షణపై రాజకీయాలు తగవు

70 దేశాల ప్రతినిధులతో భారత్ సమ్మిట్

చివరి నిమిషంలో ప్రతినిధుల వీసాలు రద్దు చేశారని ఆరోపణ

ప్రజల ప్రయోజనాలే ముఖ్యం.. పార్టీలు శాశ్వతం కాదు



- గుజరాత్ అభివృద్ధికే కేంద్రం అధిక ప్రాధాన్యం
- ఇతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతున్నది
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి
- బీజేపీని వ్యతిరేకించడం దేశాన్ని వ్యతిరేకించడం
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- భారత్ సమ్మిట్‌కు కేంద్రం అడ్డంకులు సృష్టిస్తున్నది
- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని బీజేపీ కుట్ర

హైదరాబాద్,**అభ్యుదయం**

రాష్ట్రంలో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ భవిష్య త్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 50 ఏండ్ల కిందట బీజేపీ లేదని, మరో 25 ఏండ్ల తర్వాత ఆ పార్టీ ఉనికిలో ఉండదని వ్యాఖ్యా నించారు. సీఎం శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌ను బీజేపీ రాజకీయ దృష్టితో గుడ్డిగా వ్యతిరేకిస్తున్నదని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు శాశ్వతం కాదని, ప్రజల ప్రయోజనాలే ముఖ్య మని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబ డులు తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్ష పార్టీలు తెలంగాణ ప్రయోజనాలకు విఘా తం కలిగిస్తున్నాయని

మిగతా 2లో

### పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలి

-వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు రక్షణ కల్పించాలి

-ఎన్నికల ప్రక్రియలో సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాలి

## ఇరాన్‌పై మళ్లీ దాడులకు నెతన్యాహు ఒత్తిడి!




- ట్రంప్‌పై నెతన్యాహు ఒత్తిడి
- వాషింగ్టన్‌లో మొసాద్ చీఫ్ రహస్య చర్చలు
- సీఐఏ డైరెక్టర్‌తో రోమన్ గోఫ్‌మన్ భేటీ
- విట్‌కాఫ్‌తోనూ సమావేశానికి సిద్ధం
- ఇరాన్‌పై సైనిక చర్యలకు ఇజ్రాయెల్ మొగ్గు
- దౌత్యపరమైన చర్చలకే ట్రంప్ ప్రాధాన్యం
- మరోసారి దాడులపై అమెరికా అధ్యక్షుడి విముఖత
- ఇరాన్‌పై ఆంక్షలు, నౌకల దిగ్బంధనంపైనా పరిశీలన
- రాజకీయ సంక్షోభంలో నెతన్యాహు ప్రభుత్వం

మిగతా 2లో

## పొరసరఫరాల శాఖలో సమాంతర అధికారానికి చెక్

- మంత్రి ఉత్తమ్ అసంతృప్తితో స్టీఫెన్ రవీంద్ర బదిలీ?
- సీఎంతో దూరం పాటించిన సీనియర్ మంత్రి
- శాఖాపరమైన నిర్ణయాల్లో తనకు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం
- సీఎంకు నేరుగా నివేదికలు పంపడంపై ఉత్తమ్ అసహనం
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరిట స్టీఫెన్ దూకుడు
- రైస్ మిల్లులపై రాష్ట్రవ్యాప్తంగా మెరుపు దాడులు
- సీఎంఆర్ బకాయిలు, నకిలీ ట్రక్‌షీట్లపై విచారణ
- రూ.6,630 కోట్ల బకాయిల రికవరీపై ప్రత్యేక దృష్టి
- మౌనంగానే నిరసన తెలిపిన ఉత్తమ్
- సీఎం ఫోన్‌కాల్స్, అధికారిక భేటీలకు దూరం
- స్టీఫెన్ స్థానంలో వై. నాగిరెడ్డికి బాధ్యతలు
- ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో డైరెక్టర్‌గా స్టీఫెన్ బదిలీ
- శాఖలో ఆధిపత్య పోరుకు తెరపడిందని రాజకీయ వర్గాల్లో చర్చ

మిగతా 2లో

హైదరాబాద్, **అభ్యుదయం**

తెలంగాణ పౌరసరఫరాల శాఖలో గత కొంతకాలంగా సాగుతున్న సమాంతర అధికార ప్రయోగానికి ఎట్టకేలకు తెరపడిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తన శాఖలో తన ప్రమేయం, సమన్వయం లేకుండానే కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, ముఖ్యమంత్రి కార్యాలయం అండతోనే స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారని సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు




గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.దూకుడుగా వెళ్లడం, శాఖాపరమైన కీలక నిర్ణయాలు, దాడుల విషయంలో తనకు సమాచారం

## భారత్ సమ్మిట్-2026 ప్రారంభం

నోవాటెల్ వేదికగా నిర్వహణ.. హాజరైన వివిధ కంపెనీల ప్రతినిధులు

సంవృద్ధి భారత్, ఏఐసీసీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహణ

- 70 దేశాల నుంచి ప్రతినిధులు, విధాన రూపకర్తలు, మేధావుల హాజరు
- ఎాచ్‌ఐసీసీ నోవాటెల్‌లో సమ్మిట్ నిర్వహణ
- సంవృద్ధి భారత్, ఏఐసీసీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త నిర్వహణ
- సహకార సమాఖ్యవాదంపై ప్రత్యేక చర్చలు
- సంస్కృతి, సమాజం, యువత, క్రీడలపై ప్యానెల్ చర్చలు
- ఎన్నికల సమగ్రత, ఓటర్ల హక్కులపై మేధోమథనం
- సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పారదర్శకతపై చర్చ

### తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు: మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్, **అభ్యుదయం**

భారత్ సమ్మిట్-2026 రెండో ఎడిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ నోవాటెల్ హోటల్ వేదికగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు కొనసాగే ఈ సమ్మిట్‌కు భారత్‌తోపాటు కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తున్న సుమారు 70 దేశాల నుంచి ప్రతినిధులు, విధాన రూపకర్తలు, మేధావులు హాజరయ్యారు. సంవృద్ధి భారత్ సంస్థ, ఏఐసీసీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సమ్మిట్‌లో శుక్రవారం నాలుగు అంశాలపై గ్రూప్ చర్చలు జరిగాయి .'సహకార సమాఖ్యవాదం',

- మిగతా 2లో పేజీలో



ఫీజు రీయింబర్స్‌మెంట్

## బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయి
- అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో క్లియర్ చేస్తామన్న హామీలు ఏమయ్యాయి
- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల




## మొబైల్ రీఛార్జి ధరలు పెరగాల్సిందేనా?

- కూల్‌డ్రింక్, చిప్స్ కంటే చౌకగా రీఛార్జిలు
- టెలికాం టారిఫ్‌లు చాలా తక్కువగా ఉన్నాయన్న సునీల్ మిత్తల్
- నెలకు రూ.350 చెల్లించడం సమంజసమే
- రోజుకు రూ.10-12 మాత్రమే భర్చవుతుందని వ్యాఖ్య
- కాలింగ్‌కే పరిమితం కాని మొబైల్ సేవలు
- నెట్‌వర్క్ నిర్వహణ వ్యయాలు భారీగా పెరిగాయి
- టవర్లు, ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణకు భారీ పెట్టుబడులు
- మౌలిక సదుపాయాల కోసం మరో రూ.1.5 లక్షల కోట్లు అవసరం
- ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్పూ రూ.271

# సీఐఐ సదస్సుతో ఏపీకి 303 ప్రాజెక్టులు


'నేవిగేటింగ్ ద న్యూ వరల్డ్ ఆర్డర్' థీమ్‌తో ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్ అంశాలపై రెండు రోజుల పాటు సదస్సు జరిగిందన్నారు.వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, కేంద్ర మంత్రులు ఇందులో పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి పెట్టుబడులను తీసుకురావడం, ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేయడమే తమ సంకల్పమన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుతో పాటు ఆరు సన్నాహక సమావేశాల ద్వారా పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. చేనేత క్లస్టర్ల నుంచి ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ వరకు వివిధ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. కియా సంస్థ ఏడాదికి అదనంగా రెండు లక్షల కార్ల తయారీ కోసం రూ.18,878 కోట్ల పెట్టుబడికి ముందుకు వచ్చిందని, రిలయన్స్ సంస్థ రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలతో ఒప్పందం చేసుకుందని వెల్లడించారు. 2024 నుంచి వచ్చిన 714 పెట్టుబడి ప్రతిపాదనల్లో 522 ప్రతిపాదనలు వాస్తవ రూపం దాల్చుతున్నాయని తెలిపారు.

13 లైసెన్సుల ద్వారా ఐదు రోజుల్లోనే అనుమతులు:

పారిశ్రామిక అనుమతుల విషయంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. నాలా చట్టాన్ని రద్దు చేశామని, కేవలం 13 లైసెన్సుల ద్వారా ఐదు రోజుల్లోనే అనుమతులు ఇచ్చే విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఆటోమేటిక్ అప్రూవల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాలను అమల్లోకి తెచ్చామని, ప్రతి ప్రాజెక్టుకు నిర్దేశిత గడువులోగా అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతా విధానాన్ని ప్రారంభించామని, పారిశ్రామిక సంస్కరణల్లో ఇది ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. పెట్టుబడులకు రక్షణ కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్టును కూడా అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ చట్టం దేశవ్యా ప్తంగా అమలైతే పెద్దఎత్తున పెట్టుబ డుల ప్రవాహం వస్తుందని అభిప్రాయపడ్డారు. పెట్టుబడులను ఆకర్షించ్డంతో పాటు వాటిని సంరక్షించడం, కార్యరూపంలోకి తీసుకురావడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

ఏఐ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో కొత్త లక్ష్యాలు:

గతంలో ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని తెలుగువారిని ప్రపంచస్థాయి నిపుణులుగా నిలిపామని, ఇప్పుడు 'వన్ ఫ్యామిలీ వన్ ఏఐ' విధానం ద్వారా నైపుణ్యం కలిగిన వారిని తయారు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రతి ఇంటిపైనా సౌర ఫలకాలను ఏర్పాటు చేసి అధిక విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం ఉండగా, ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 160 గిగావాట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుందని తెలిపారు. కేంద్రం సహకరిస్తే ఈ లక్ష్యాన్ని మించి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.



మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు డ్వాక్రా మహిళలకు చేయూత అందిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టును పూర్తి చేసుకున్నామని, విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ, సౌత్ కోస్టల్ రైల్వే జోన్ వంటి ప్రాజెక్టులు కూడా సాకారమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే లక్ష మంది మార్గదర్శులు 11 లక్షల కుటుంబాలను దత్తత తీసుకుని వారికి మద్దతుగా నిలిచారని వెల్లడించారు. కేవలం డబ్బు మాత్రమే జీవన ప్రమాణాలను పెంచలేదని, వారికి అందించే చేయూత, సాధికారతతోనే మెరుగైన జీవితం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాజంలోని ఉన్నతస్థాయి వర్గాలు పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలనే సంకల్పంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఈ పథకం నిర్వీర్యమైపోయిందని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.

వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేదవాడి చదువుకు పండుగలా ఉండేదని గుర్తుచేశారు. నేడు చంద్రబాబు పాలనలో అదే పథకం వేల కోట్ల బకాయిలతో చదువంటేనే దండుగగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఈ పథకం బకాయిలు రూ.6,400 కోట్లు దాటిపోయాయని, అందులో గత మూడేళ్లలోనే రూ.6,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆమె తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని షర్మిల దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని బకాయిలు క్లియర్ చేస్తామని, నేరుగా కాలేజీల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆమె నిలదీశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు దక్కక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని భారీ ప్రచారాలు చేసుకుంటూ, మరోవైపు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెంచుకుంటూ పోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మొబైల్ రీఛార్జి ధరలు పెరగాల్సిందేనా?

ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్‌లో టెలికాం టారిఫ్‌లు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. అంతేకాక కూల్‌డ్రింక్, చిప్స్ ప్యాకెట్ కంటే మొబైల్ రీఛార్జి ధరలే తక్కువ ఉన్నాయని మిత్తల్ అభిప్రాయపడ్డారు. వినియోగదారుల సగటున నెలకు సుమారు రూ.350 వరకు చెల్లించడం సముచితంగా ఉంటుందని ఆయన తెలిపారు. భారతీ ఎంటర్‌ప్రైజెస్ అర్ధ శతాబ్ధం పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

మొబైల్ కనెక్షన్ ద్వారా ఒకప్పటిలా వినియోగదార్లు కేవలం కాలింగ్ మాత్రమే చేయడం లేదని, బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, విద్య, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు వంటివి వినియోగిస్తున్నారని సునీల్ మిత్తల్ అన్నారు. ఈ సేవలకుగానూ టెలికాం వినియోగదారులు చెల్లిస్తున్న మొత్తం చాలా తక్కువేనని ఆయన అభిప్రాయపడ్డారు. టెలికాం టారిఫ్ సగటున నెలకు రూ.350 ఉంటే సమంజసంగా ఉంటుందని, ఆ లెక్కన రోజుకయ్యే ఖర్చు రూ.10-12 మాత్రమేనని మిత్తల్ పేర్కొన్నారు.

నెట్‌వర్క్ నిర్వహణ వ్యయం, ఉద్యోగుల జీతాలు, విద్యుత్ ఛార్జీల రూపంలో ఖర్చులు భారీగా పెరిగాయని మిత్తల్ వెల్లడించారు. మరోవైపు చైనాలో 10 లక్షలకు పైగా మొబైల్ టవర్లు ఉండగా.. భారత్‌లో 3.5 లక్షలు మాత్రమేనన్నారు. ప్రస్తుతం ఉన్న టవర్ మౌలిక సదుపాయాలను కనీసం రెట్టింపు చేయాలి. ఫైబర్ కనెక్టివిటీ, బ్రాడ్‌బ్యాండ్ కేబుల్ నెట్‌వర్క్‌లను విస్తరించడానికి కూడా గణనీయమైన ఖర్చు అవుతుంది. అందుకోసం మరో రూ.1.5 లక్షల కోట్లు అవసరం పడుతుందని చెప్పారు.టెలికాం యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం రూ.300 ఉండాలని గతంలో సునీల్ మిత్తల్ పలుమార్లు ప్రస్తావించారు. తాజాగా ఆ మొత్తం రూ.350కి చేరితే సమంజసంగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే టెలికాం ఛార్జీల పెంపు ఉంటుందని భావిస్తున్న వేళ.. ఆయన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అయితే, టారిఫ్ ధరల పెంపు ఎప్పుడు అని ప్రశ్నించగా.. తనకు తెలియదంటూ సమాధానం దాటవేశారు.

## ఇరాన్‌పై మళ్లీ దాడులకు

# నెతన్యాహు ఒత్తిడి!



ఇరాన్‌పై మరోసారి దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడి పెంచుతోందా? తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు ఈ అనుమానాలకు తావిస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అత్యంత సన్నిహితుడైన మొసాద్ చీఫ్ రోమన్ గోఫ్‌మన్ ప్రస్తుతం వాషింగ్టన్‌లో పర్యటిస్తున్నారు. ఇరాన్ యుద్ధానికి సంబంధించి ట్రంప్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో ఆయన చర్చలు జరుపుతున్నారు. అమెరికా నిఘా సంస్థ సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్‌తోనూ ఆయన సమావేశమైనట్లు పలు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆక్సియోస్ మీడియా సంస్థ వెల్లడించింది. గోఫ్‌మన్ తర్వాత మియామీ వెళ్లి వైట్‌హౌస్ ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌తోనూ భేటీ కానున్నారని తెలిపింది. ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్యలు చేపట్టాలని ట్రంప్‌ను నెతన్యాహు కోరుతున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఇజ్రాయెల్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొంది. గత నెల 27న జరిగిన ఎన్నికల తర్వాత నెతన్యాహు సంకీర్ణ కూటమి పార్లమెంటులో మెజారిటీ కోల్పోయిన విషయం తెలిసిందే.ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించాలని ట్రంప్‌ను నెతన్యాహు కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇరాన్‌తో చర్చలకు మరికొంత సమయం ఇవ్వాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈనెల 5న ఇరాన్ యుద్ధ పరిణామాలపై ఇరువురు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా నెతన్యాహు మళ్లీ సైనిక చర్యలకు మొగ్గు చూపగా.. దౌత్యపరమైన ప్రయత్నాలను కొనసాగించడమే మంచిదని ట్రంప్ అభిప్రాయపడ్డారని ఇజ్రాయెల్ మీడియా సంస్థ ఎన్12 వెల్లడించింది. ఇరాన్‌పై మరోసారి దాడులు చేయడం లేదా చర్చల ద్వారా ఒక ఒప్పందానికి రావడం లేదా నౌకలను దిగ్బంధించి ఆర్థిక ఆంక్షలను కొనసాగించడం వంటి చర్యలు చేపట్టేందుకు ట్రంప్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్ విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

## గన్నవరం ఎయిర్‌పోర్టులో
## మాజీ మంత్రి తలసానికి ఘన స్వాగతం

అమరావతి : సదర్ వేడుకల్లో పాల్గొనేందుకు ఏపీలోని గన్నవరానికి వచ్చిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఘన స్వాగతం లభించింది. శుక్రవారం మంగళగిరి లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సదర్ వేడుకలలో పాల్గొనేందుకు గన్నవరం ఎయిర్ పోర్ట్ కు రాగా యాదవ సంఘాల నాయకులు, తలసాని అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో తలసాని శ్రీనివాస్ యాదవ్ కు స్వాగతం పలికారు

## విద్యార్థుల హాస్టళ్ల మూసివేతపై

# శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం

మహబూబ్ నగర్ : హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమాన్ని బలహీనపరి చేందుకు అప్పటి ప్రభుత్వం హాస్టళ్లలో నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యార్థులను బయటకు పంపించే కుట్ర మాదిరిగానే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

## మరో 25 ఏండ్ల తర్వాత బీజేపీ ఉనికి ఉండదు

విమర్శించారు.వాతావరణ మార్పులు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల అవకాశాలపై అంతర్జాతీయ ప్రతినిధులతో ఈ సమ్మిట్‌లో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. తెలంగాణలో ఉన్న అనుకూల పరిస్థితులు, హైదరాబాద్‌లోని అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మంది వరకు ప్రతినిధులు హాజరుకావాల్సి ఉన్నదని చెప్పారు. అయితే కొందరు ప్రతినిధులను చివరి నిమిషంలో బీజేపీ ప్రభుత్వం అడ్డుకున్నదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వీసాలను రద్దు చేయడంతో కొందరు విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత కూడా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. భారత్ సమ్మిట్‌తో ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నదంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నేత రామచందర్‌రావుకు ఎందుకంత కోపమని ప్రశ్నించారు.

గుజరాత్‌కే అధిక ప్రాధాన్యం

ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గుజరాత్ అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు గిఫ్ట్ సిటీ తరహా మౌలిక సదుపాయాలు కల్పించడంలో వివక్ష చూపుతున్నదని విమర్శించారు. అన్ని రాష్ట్రాల అభివృద్ధికి సమాన అవకాశాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉండాలని, ఒక రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చి మిగతా రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాల్సిందిపోయి రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నదని ఆరోపించారు.

## భారత్ సమ్మిట్-2026 ప్రారంభం

సంస్కృతి-సమాజం', 'యువత-క్రీడలు, 'ఎన్నికల సమగ్రత (పారదర్శకత, ఓటర్ల హకులు, ఈసీ పాత్ర), సామాజిక న్యాయం' అనే అంశాలపై ప్రత్యేక ప్యానెల్ చర్చలు నిర్వహించారు. అనంతరం ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం జరిగింది. ఎలక్ట్రానిక్స్, తయారీ, ఔషధాలు, క్లీన్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, టెలికాం ఇంజినీరింగ్, ఫార్మా, ఐటీ/ ఐటీఈఎస్ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రం అన్ని రకాలుగా అనుకూలమని శ్రీధర్‌బాబు వివరించారు.రాష్ట్రంలో తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించడంతోపాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలను విస్తరించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్‌రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు
# నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలి

రాప్తాడు బాలిక గోపికకు
వైయస్ఆర్‌సీపీ అండపంచాయతీ
ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా
చూడాలిరైతుల గోడు పట్టని కూటమి
ప్రభుత్వంరాష్ట్ర ప్రచార విభాగాన్ని
మరింత బలోపేతం చేస్తాంవిద్యార్థుల
ప్రాణాలతో
చెలగాటమా?గెలుపోటములకు
అతీతంగా.. మన ఐక్యతే మన
బలంకూటమి పాలనలో భ్రష్ట పట్టిన
విద్యా వ్యవస్థ.. ప్రచార ఆర్భాటంతో
ప్రజలకు వంచనవిద్యార్థుల
బలవన్మరణాలకు ప్రభుత్వానిదే
బాధ్యతపంచాయతీ ఎన్నికల్లోనైనా
అక్రమాలకు తావివ్వొద్దురాప్తాడు
బాలిక గోపికకు వైయస్ఆర్‌సీపీ



అండపంచాయతీ ఎన్నికలు
నిష్పక్షపాతంగా జరిగేలా
చూడాలిరైతుల గోడు పట్టని కూటమి
ప్రభుత్వంరాష్ట్ర ప్రచార విభాగాన్ని
మరింత బలోపేతం చేస్తాంవిద్యార్థుల
ప్రాణాలతో
చెలగాటమా?గెలుపోటములకు
అతీతంగా.. మన ఐక్యతే మన
బలంకూటమి పాలనలో భ్రష్ట పట్టిన
విద్యా వ్యవస్థ.. ప్రచార ఆర్భాటంతో
ప్రజలకు వంచనవిద్యార్థుల
బలవన్మరణాలకు ప్రభుత్వానిదే
బాధ్యతపంచాయతీ ఎన్నికల్లోనైనా
అక్రమాలకు తావివ్వొద్దు

# పౌరసరఫరాల శాఖలో సమాంతర అధికారానికి చెక్

ఇవ్వకుండా నేరుగా ముఖ్యమంత్రికే రిపోర్టులు

పంపుతున్నారని ఉత్తమ్ గత కొంతకాలంగా తీవ్ర అసహనంతో ఉన్నట్టు తెలిసింది. మంత్రి తన అసంతృప్తిని నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కొంతకాలం సీఎంతో దూరం పాటించారని, చివరికి మాటలు, ఫోన్లు, భేటీలు కూడా కట్ చేసుకున్నారనే చర్చ నడుస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా స్టీఫెన్ రవీంద్రను పౌరసరఫరాల శాఖ నుంచి తప్పించారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

దూకుడుగా వెళ్లిన స్టీఫెన్ రవీంద్ర

గత ఏడాది సెప్టెంబర్‌లో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరిట దూకుడు పెంచారు. ముఖ్యంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిలు, నకిలీ ట్రక్‌షీట్లు, సన్నబియ్యానికి బదులు దొడ్డు బియ్యం సరఫరా వంటి ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులపై మెరుపు దాడులు, సీఐడీ విచారణలకు ఆదేశాలు జారీచేశారు. నిజామాబాద్ డీసీఎస్వో సస్పెన్షన్, పలువురు మిల్లర్ల అరెస్టులు, రూ.6,630 కోట్ల మేర పేరుకుపోయిన బకాయిల రికవరీ పేరిట సాగిన ఈ ఆపరేషన్ శాఖ మంత్రి ప్రమేయం లేకుండానే జరిగిపోయిందని చెప్తున్నారు.

ఒకవైపు ధాన్యం కొనుగోళ్లు, తేమ శాతం నిబంధనలు, బియ్యం ధరల నియంత్రణ వంటి అంశాల్లో రైతులు, మిల్లర్లు, వ్యాపారుల నుంచి వచ్చే ఒత్తిడిని మంత్రి ఉత్తమ్ ఎదురోవాల్సి వస్తుంటే, మరోవైపు కమిషనర్ స్థాయి అధికారి తనకు చెప్పకుండానే దాడులు చేయించడం మంత్రిని రాజకీయంగా ఇరుకునపెట్టిందని పార్టీ నేతలు అంటున్నారు. క్షేత్రస్థాయిలో మిల్లర్లు అజ్ఞాతంలోకి వెళ్లడం, ధాన్యం సేకరణపై ఆ ప్రభావం పడటం వంటి పరిణామాలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయని చెప్తున్నారు.

మౌనంగానే నిరసన తెలిపిన ఉత్తమ్

తన శాఖలోనే తనకు తెలియకుండా జరుగుతున్న ఈ పరిణామాలతో ఉత్తమ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారని ఆయన సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే ఉత్తమ్ తన నిరసనను మౌనంగానే, అత్యంత పదునుగా వ్యక్తంచేశారనే ప్రచారం జరుగుతున్నది. సీఎంతో నేరుగా మాట్లాడటం నిలిపివేయడంతోపాటు, సీఎం ఫోన్‌కాల్స్‌కు స్పందించకపోవడం, అధికారిక భేటీలకు దూరంగా ఉండటం వంటి చర్యలతో తన అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం.

సీనియర్ మంత్రి అలిగి దూరం జరుగడం ప్రభుత్వ మనుగడ, పార్టీ ప్రతిష్టకు ఇబ్బందికరంగా మారుతుందని గ్రహించిన సీఎం ఎట్టకేలకు దిగిరాక తప్పలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో స్టీఫెన్ రవీంద్రను పౌరసరఫరాల శాఖ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, కొత్తగా ఏర్పాటైన తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్,
రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ చేశారనే ప్రచారం జరుగుతున్నది. ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి వై నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా నియమించారు.

# రెండు శాతం ఓట్ల పార్టీకి చైర్‌పర్సన్ పీఠమా?

పార్వతీపురం మన్యం: సాలూరు మున్సిపల్ ఎన్నికల వేడి చల్లారినా.. కూటమిలో రాజకీయ సెగలు మాత్రం తగ్గడం లేదు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం, జనసేన నాయకుల మధ్య రాజుకున్న విభేదాలు ఇప్పుడు మరోసారి బహిరంగ యుద్ధానికి దారితీస్తున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని జనసేన దక్కించుకున్నప్పటికీ.. ఆ విజయానికి ముందు జరిగిన రాజకీయ పరిణామాలు మాత్రం ఇంకా ఆ పార్టీ నేతలను వెంటాడుతున్నాయి. తాజాగా చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గొర్లె విజయకుమారితో పాటు జనసేన నాయకులు మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు సాలూరు రాజకీయాల్లో మరోసారి కలకలం రేపుతున్నాయి.

### కూటమి ధర్మానికి తూట్లు పొడిచారా?

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని మంత్రి సంధ్యారాణి విస్మరించారని జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులను బరిలోకి దింపి వారికి మద్దతు పలికారని, తద్వారా జనసేన అభ్యర్థుల విజయావకాశాలను దెబ్బతీసేందుకు ప్రయత్నించరని మండిపడుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులందరికీ ఒకే విధంగా బీరువా గుర్తు వచ్చేలా చేయ డం వెనుక కూడా అనుమానాలున్నాయని చెబుతున్నారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి ఒక్కసారి కూడా జనసేన అభ్యర్థుల తరఫున ప్రచారం చేయలేదని విమర్శిస్తున్నారు. ఈ ఆరోపణలను జనసేన తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గొర్లె విజయకుమారి, ఆ పార్టీ నాయకులు గొర్లె తిరుపతినాయుడు, జరజాపు సూరిబాబు బహిరంగంగా వెల్లడించడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి తీరుపై కూటమి పెద్దలకు ఫిర్యాదు చేస్తామ ని వారు స్పష్టం చేస్తున్నారు.

### రెండు శాతం ఓట్ల పార్టీకి చైర్‌పర్సన్ పీఠమా?

ఈ వివాదానికి ఎన్నికలకు ముందే బీజం పడింది. సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంపై మంత్రి సంధ్యారాణి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. రెండు శాతం ఓటు బ్యాంకు ఉన్న జనసేనకు చైర్‌పర్సన్ టికెట్ కేటాయించడ మేంటంటూ ఆమె బహిరంగంగా వ్యాఖ్యానించిన ట్లు జనసేన నాయకులు గుర్తుచేస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై అప్పట్లోనే ఆ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు, వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి వచ్చిన వారికి టికెట్లు కేటాయించడంపైనా



మంత్రి అసహనం వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గా ల్లో చర్చ సాగింది. జనసేనకు అధికారికంగా బీఫా రాలు అందించినప్పటికీ, గతంలో హామీ ఇచ్చిన కొందరిని స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దింపేందుకు ప్రోత్సహిం చారనే ఆరోపణ లు కూడా వినిపించాయి. వీటన్నింటినీ ప్రస్తావిస్తు న్న జనసేన నేతలు.. ఎన్నికల్లోనూ తమ పార్టీ అభ్యర్థులఓటమికిప్రయత్నాలుజరిగాయని ఆరోపిస్తున్నారు.

## ఎల్‌నినో ప్రభావం..
## రబీ పంటలపై జిల్లా కలెక్టర్లకు సీఎస్ కీలక ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్13: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని.. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితులపై శుక్రవారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రబీ పంటల సాగు కార్యాచరణ ప్రణాళికపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారికి స్పష్టం చేశారు. అందుకోసం జిల్లాల వారీగా పకడ్బందీగా రబీ సాగు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.నీటి లభ్యత ఆధారంగా పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. అలాగే రబీకి అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని అన్నారు. కూరగాయలు, పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని వివరించారు. బిందు సేద్యం, సూక్ష్మ సేద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూసేకరణ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారికి సీఎస్ సంజయ్ జాజు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను తరచూ తనిఖీ చేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులు వేగవంతం చేయాలని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారిని కోరారు. ప్రభుత్వ ప్రాధాన్యతల అమలుపై నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

## మోత్కూరులో తీన్మార్ మల్లన్న కారును ఢీకొట్టిన లారీ.. తప్పిన ప్రాణాపాయం



అదే లారీ మరో కారును కూడా ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు గాయపడ్డారు. వారితో పాటు ఉన్న చిన్నారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో మోత్కూరు నుంచి తిరుమలగిరి వరకు కొనసాగించాల్సిన బీసీ రాజ్యాధికార పాదయాత్రను టీఆర్పీ నాయకత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ఈ ప్రమాదం సాధారణ రోడ్డు ప్రమాదమేనా? దీని వెనుక ఏదైనా కుట్ర కోణం ఉందా? అనే అనుమానాలను టీఆర్పీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలు, కుట్ర ఆరోపణల్లో వాస్తవాలపై పోలీసుల విచారణలో స్పష్టత రావాల్సి ఉంది.

## ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం.. ఎమ్మెల్యే గంగుల



కరీంనగర్ ప్రతినిధి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ ధాన్యానికి రూ.3,100 వరకు ధర లభిస్తుంటే, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రూ.2,900 మాత్రమే చెల్లిస్తే రైతులు అక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు. ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుంటే ప్రభుత్వ కేంద్రాలకు రైతులు రావడం సహజంగానే తగ్గుతుందని, బహిరంగ మార్కెట్ ధరకు సమానంగా ప్రభుత్వం కొనుగోలు ధర కల్పిస్తేనే రైతులు ప్రభుత్వ కేంద్రాల వైపు మొగ్గు చూపుతారని స్పష్టం చేశారు.

శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలంలోని చామన్‌పల్లి, చర్లబూత్కూర్, ముగ్ధంపూర్ గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం రైస్ మిల్లర్లు నేరుగా గ్రామాలకు చేరుకుని రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక తగ్గుతోందన్నారు. ధాన్యం కొనుగోలులో హమాలీ ఖర్చులు, తాలు, తరుగు పేరుతో రైతులపై అదనపు భారం పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్దకే వచ్చి ధాన్యం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని, రాష్ట్రంలో పండిన ధాన్యం రాష్ట్ర అవసరాలకే ఉపయోగపడేలా సివిల్ సప్లై ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై రైతులకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ఈసారి ప్రభుత్వ కేంద్రాలకు కేవలం 25 నుంచి 30 శాతం ధాన్యం మాత్రమే వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే కొనుగోళ్లలో కీలకమని, మార్కెట్ ధరకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే రైతులకు నష్టం జరిగే ప్రమాదం ఉందని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## బాబు కంటే నేనే సీనియర్..
## నా మాటకు విలువ లేదా?



విజయనగరం జిల్లా: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్‌తో నేను సమకాలీనుడిని. ఆయన నేను కలిసి ఒకే టేబుల్‌పై భోజనం కూడా చేసేవారం. టీడీపీ ఆవిర్భావంలో ఎన్నో సంక్షేమ పథకాల రూపకల్పనలో నా భాగస్వామ్యం కూడా ఉంది. ప్రస్తుత నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కూడా నాకంటే పార్టీలో జూనియర్ అంటూ ఎన్నో సమావేశాల్లో చెబుతున్న మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు, స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు మాట చెల్లడం లేదా? ఆయన నిర్ణయాలకు సొంత పార్టీ నేతల నుంచే గౌరవం లభించడం లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పార్టీ అధికారంలో ఉండి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉంటూ నిన్నగాక మొన్న జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో స్వయాన కోడలి ఓటమిని తట్టుకోలేక మధనపడుతున్న తరుణంలో నియోజవకర్గంలోని మెరకముడిదాం మండలం టీడీపీ నేతలు తిరుగుబావుటా ఎగురవేయడంతో కళావెంకటరావు వైభవం చీపురుపల్లి నియోజక వర్గంలో మసకబారుతోంది. ఎంపీపీ విషయంలో ఎమ్మెల్యే కళా వెంకటరావు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సాక్షాత్తు ఆ పార్టీ మెరకముడిదాం మండల అధ్యక్షుడు, తాజా జెడ్పీటీసీ భర్త, సీనియర్ నాయకుడు తాడ్డి సన్యాశినాయుడు(సన్ని) పొరుగు రాష్ట్రంలో ప్రత్యేక 'క్యాంప్' ఫైర్ రగిలి ంచారు. దీంతో ఈ టాపిక్ జిల్లా వ్యాప్తంగా హాట్‌హాట్‌గా మారి చర్చనీయాంశమవుతోంది.

### 9 మంది ఎంపీటీసీలతో క్యాంప్..

మెరకముడిదాం మండలానికి చెందిన పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు తాడ్డి సన్యాశినాయుడు అదే పార్టీకి చెందిన 9 మంది ఎంపీటీసీలతో, ఎమ్మెల్యే 'కళా వెంకటరావుకు తెలియకుండా పొరుగు రాష్ట్రంలో ప్రత్యేక క్యాంప్ పెట్టిన విషయం గురువారం ఉదయానికి గుప్పుమంది. బుధవారం రాత్రి 9 మంది ఎంపీటీసీలను తీసుకుని సోమలింగాపురం ఎంపీటీసీ నానితో కలిసి పొరుగు రాష్ట్రానికి వెళ్లినట్లు తెలిసింది. మెరకముడిదాం మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అందులో కూటమి అభ్యర్థులు 14 ఎంపీటీసీ స్థానాలు గెలుపొందగా వారిలో 9 మంది ఎంపీటీసీలను తీసుకుని ప్రత్యేక క్యాంప్‌కు వెళ్లడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అయితే ఈ రహస్య క్యాంప్ బెంగళూరులో నడుస్తోందని కొంతమంది చెబుతుండగా ఒడిశాలో ఉందని మరికొంత మంది చర్చించుకుంటున్నారు.

### ఎమ్మెల్యే నిర్ణయానికి వ్యతిరేకంగా..

మెరకముడిదాం మండల ఎంపీపీగా కోట్ల మోతీలాల్‌నాయుడు పేరును ఎమ్మెల్యే కళా వెంకటరావు ఎన్నికల ముందే ప్రకటించారు. మోతీలాల్‌నాయుడు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీలో చేరారు. గత రెండున్నరేళ్లుగా టీడీపీలోనే కొనసాగుతున్నారు. అయితే టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా, మాజీ ఎంపీపీగా, సీనియర్ నాయకుడిగా టీడీపీ అనగానే మెరకముడిదాం మండలంలో గుర్తచ్చేది తాడ్డి సన్యాశినాయుడి పేరు. అలాంటి సన్యాశినాయుడు ఎంపీపీ పదవిని తనకివ్వాలని ఎమ్మెల్యేను కోరినప్పటికీ కుదరదని జెడ్పీటీసీగా పోటీకి దిగాలని ఎన్నికల ముందు స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఎంపీపీ ఇవ్వకుండా అవమానిస్తున్నారంటూ జెడ్పీటీసీ పోటీకి వెళ్లేందుకు ఇష్టం లేని సన్యాశినాయుడు కొద్ది రోజులు తాత్సారం చేశారు. ఇంతలో ఎమ్మెల్యే కార్యాలయం నుంచి జెడ్పీటీసీ అభ్యర్థిగా మరొకరి పేరు కూడా పంపినట్లు ఆయన వర్గీయులు చెప్పుకుంటున్నారు. ఇంతలో ఏమైందో గానీ సన్యాశినాయుడు భార్యతో జెడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేయించి గెలుపొందారు. తనకు జరిగిన అవమానానికి ఎమ్మెల్యేకు దీటైన సమాధానం ఇచ్చేందుకు సిద్ధమైన సన్యాశినాయుడు 9 మంది ఎంపీటీసీలను తీసుకుని క్యాంప్‌కు వెళ్లారు.

### పట్టు కోల్పోతున్న ఎమ్మెల్యే..

పార్టీ ఇంకా రెండున్నరేళ్లు అధికారంలో ఉంటుంది, ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ స్వయాన ఆయన కోడలు గరివిడి జెడ్పీటీసీగా ఓటమి పాలవడంతో పాటు గరివిడి మండలంలోని ఎంపీటీసీలను కూడా వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. అలాగే గుర్ల మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు కూడా వైఎస్సార్‌సీపీకి దక్కడంతోనే నియోజకవర్గంలో ఎమ్మెల్యే పట్టు కోల్పోతున్నట్లు చర్చ మొదలైంది. దీనికి తోడు మెరకముడిదాం మండలంలో ఇలా సొంత పార్టీ నాయకులే ఆయనను ఎదిరించి ఎంపీటీసీలను ప్రత్యేక క్యాంప్‌కు తీసుకెళ్లిపోవడంతో ఆ చర్చలకు మరింత బలాన్ని చేకూర్చుతున్నాయనే వాదన వినిపిస్తోంది. అంతేకాకుండా ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎన్నో చోట్ల కూటమిలో రెబల్స్ బరిలో ఉన్నప్పటికీ వారిని బుజ్జగించి నామినేషన్లు ఉపసంహరించుకునే విధంగా చర్యలు చేపట్టడంలో కూడా విఫలమయ్యారనే చర్చ సొంత పార్టీలోనే జరుగుతోంది.

## విభజన గాయాలతో ఇబ్బందులు పడినా అభివృద్ధిలో దూసుకుపోతున్న ఏపీ: ఉప రాష్ట్రపతి



విశాఖపట్నం, నవంబర్13: విభజన గాయాలతో ఇబ్బందులు పడినా ఇప్పుడు అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దూసుకుపోతోందని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడిని ఏపీ ఆకర్షించటం చిన్న విషయం కాదని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా స్వర్ణాంధ్ర సాధన వైపు ఏపీ నడుస్తోందని చెప్పారు. విశాఖపట్నం వేదికగా జరుగుతున్న 31వ వార్షిక సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమానికి ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తోపాటు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. రెండు రోజులు జరిగిన పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలతో పాటు మేథోమథనం కూడా ఈ సదస్సులో జరిగిందని అన్నారు. వచ్చే ఏడాది నిర్వహించే సదస్సుకు కూడా పారిశ్రామిక వేత్తలను ఇప్పుడే సీఎం చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ వేర్వేరు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయని సీపీ రాధాకృష్ణన్ వివరించారు. నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టులు, ఎలక్ట్రానిక్స్, స్పేస్, డిఫెన్స్, టూరిజం తదితర రంగాల్లో ఏపీ పెట్టుబడుల్ని ఆకట్టుకుంటోందని తెలిపారు. ప్రతీ సంక్షోభ సమయం అంతే స్థాయిలో అవకాశాలను కూడా తీసుకువస్తుందని చెప్పారు. ఈ సమయంలో భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా అవకాశాలను అందిపుచ్చుకుంటోందని అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో వికసిత్ భారత్ లక్ష్యాలను దేశం అందుకునేందుకు ముందుకు వెళ్తోందని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. గ్రోత్ ఇంజన్లుగా వేర్వేరు రంగాలు అభివృద్ధి పథంలో వెళ్తున్నాయని తెలిపారు. సమీప భవిష్యత్తులో టెక్నాలజీ రంగమే ఓ డ్రైవింగ్ ఫోర్సుగా నిలుస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఏఐ లాంటి ఆధునాతన టెక్నాలజీని పాలన, పౌరసేవల కోసం వినియోగించటం అభినందనీయమని పేర్కొన్నారు.డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రా తయారు చేయటం ఓ కీలకమైన అంశంగా మారుతుందని సీపీ రాధాకృష్ణన్ చెప్పారు. మన తయారీ రంగంతో పాటు దేశీయ పరిశ్రమలు అంతర్జాతీయ పోటీని తట్టుకునేలా సిద్ధం కావాలని ఆకాంక్షించారు. దేశం ఓ బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి అవసరమైన రంగాలపై మనమంతా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

# పల్మనరీ ఎంబాలిజంతో హేమంత్‌కు తీవ్ర అస్వస్థత

**మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలింపు.. పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో తరలింపు**

అనంతపురం, నవంబర్ 13:
రాప్తాడు బాలికపై దాడి ఘటనలో నిందితుడిగా ఉన్న హేమంత్ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అతడిని కర్నూలుకు రెఫర్ చేశారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో కర్నూలుకు తరలించారు. గత 13 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన అనంతరం పోలీసుల కాల్పుల్లో హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుల్లెట్ గాయాల కారణంగా కుడికాలులో రక్తప్రసరణ నిలిచిపోవడంతో కాలు కుళ్లిపోయి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడింది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి కుడికాలును తొలగించారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం హేమంత్‌కు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి. మంచం నుంచి కిందపడటంతో వైద్యులు సిటీ స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఊపిరితిత్తుల్లో పల్మనరీ ఎంబాలిజం ఉన్నట్లు గుర్తించారు. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల ఈ సమస్య ఏర్పడినట్లు వైద్యులు నిర్ధారించారు. శస్త్రచికిత్స అనంతరం తలెత్తే తీవ్రమైన సమస్యల్లో పల్మనరీ ఎంబాలిజం ఒకటి. రక్తనాళాల్లో ఏర్పడిన రక్తపు గడ్డలు ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో అడ్డంకులు సృష్టించడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

# మడకశిరలో కూటమి విజయోత్సవ ర్యాలీ

**23 వార్డుల్లోనూ విజయం.. ఐదు జడ్పీటీసీ స్థానాలు కైవసం**



మడకశిర నవంబర్ 13:
మడకశిర మున్సిపాలిటీలోని 23 వార్డులకు 23 వార్డులను కైవసం చేసుకోవడంతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఐదు జడ్పీటీసీ స్థానాల్లో విజయం సాధించిన సందర్భంగా గురువారం కూటమి ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నాయకత్వంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి జ్యోతిరావు పూలే సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుండుమల శారదా రాధాకృష్ణ, కుంచిటి కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వి.జయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ డి. శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ మడకశిరలో కూటమి సాధించిన విజయం ప్రజల విశ్వాసానికి, కూటమి ఐక్యతకు, కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇదే ఐక్యతతో మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఉత్సాహంగా కృషి చేస్తామని తెలిపారు.

# ఎన్నికల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

***రౌడీషీటర్లు, పాత నేరస్థులకు అడిషనల్ ఎస్పీ అంకిత సురానా కౌన్సెలింగ్ బెయిల్ షరతులు ఉల్లంఘిస్తే రిమాండ్‌కు పంపిస్తాం***



పుట్టపర్తి, నవంబర్ 13:త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అల్లర్లు, రాజకీయ ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీ సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ అంకిత సురానా హెచ్చరిం చారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో పర్యటించి రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని, చట్ట నిబంధనలు పాటించాలని సూచించారు. బెయిల్‌పై ఉన్నవారు షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు చర్యలు తీసుకుని తిరిగి రిమాండ్‌కు పంపిస్తామని హెచ్చరించారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే పూచీకత్తుగా సమర్పించిన రూ.5 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం పోలీస్ స్టేషన్లలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంతో పాటు ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాలను సందర్శించి నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కదిరి డీఎస్పీలు శివనారాయణ స్వామి, బి.వి. జగన్నాథరాజు, సీఐలు రామసుబ్బయ్య, సునీత, ఎస్సైలు కృష్ణవేణి, శేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బత్తలపల్లి గ్యాస్ సమస్యపై మంత్రి సత్యకుమార్ తక్షణ స్పందన

**48 గంటల్లో సరఫరా సమస్య పరిష్కారానికి చర్యలు.. వారం రోజుల్లో శాశ్వత పరిష్కారం**

**అధికారులతో మాట్లాడిన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు**

బత్తలపల్లి, నవంబర్ 13: బత్తలపల్లి మండలంలో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ స్పందించారు. వినియోగదారులు గ్యాస్ సిలిండర్ల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్న పరిస్థితిని తెలుసుకున్న మంత్రి.. సమస్యను తక్షణమే పరిష్కరించాలని తన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబును ఆదేశించారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్నప్పటికీ ఓటీపీ వచ్చిన తర్వాత కూడా సకాలంలో సిలిండర్లు అందకపోవడం, కొందరు వినియోగదారులు స్వయంగా ఏజెన్సీ కార్యాలయాలకు వెళ్లి సిలిండర్లు తెచ్చుకోవాల్సి రావడంపై మంత్రి దృష్టి సారించారు. మంత్రి ఆదేశాల మేరకు హరీష్ బాబు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ పర్సన్ వెంకన్నతో మాట్లాడారు. బత్తలపల్లి మండలంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, గ్యాస్ సరఫరా వ్యవస్థను వెంటనే మెరుగుపరచాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు 48 గంటల్లో సరఫరా సమస్యను పరిష్కరించి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా వారం రోజుల్లోగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.
బుకింగ్ చేసుకున్న ప్రతి వినియోగదారుడికి సకాలంలో గ్యాస్ సిలిండర్ అందేలా అధికారులు, గ్యాస్ కంపెనీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేసినట్లు హరీష్ బాబు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

# నల్లమాడ టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా డి. సూర్యనారాయణ రెడ్డి

**మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రకటన.. టీడీపీలోకి పలువురు చేరిక**





నల్లమాడ,నవంబర్ 13:
పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండల కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా డి. సూర్యనారాయణ రెడ్డి (హెచ్.పీ. గ్యాస్ సూరి) పేరును మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రకటించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ తరఫున ఆయన పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. నల్లమాడ మండలంలో గత కొంతకాలంగా హెచ్.పీ. గ్యాస్ ఏజెన్సీ ద్వారా ప్రజలకు సేవలందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి గుర్తింపు పొందిన సూర్యనారాయణ రెడ్డికి పార్టీ అభ్యర్థిత్వం దక్కడం పట్ల స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఇదే కార్యక్రమంలో బాసంవారిపల్లెకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. నల్లమాడ–2 అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓటమి చెందిన రాంప్రసాద్ బంధువులైన కుంచపు దాసప్ప, కిష్టప్ప, ఎం. గోపాల్, రాములమ్మ, సాయిమ్మ, చెన్నప్ప, రాములమ్మ గోపాల్ తదితరులకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర్, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, బి.కె. కేశవరెడ్డి, సలాం ఖాన్, పెద్దప్పయ్య నాయుడు, గన్ రెడ్డి, రమణారెడ్డి, మైలే రామచంద్ర, బాబావలి, రాజారెడ్డి, కేశవులు, నాగేనాయక్, నల్లమాడ–2 అభ్యర్థి రాంప్రసాద్, ఫకీర్ నాయక్, గంగులప్ప, పల్లపు శ్రీరాములు, రెడ్డిపల్లి నాయుడు, ఎం. చిన్నారెడ్డి, మణికుమారి, ఎంపీటీసీ చినబాబు, రషీద్ ఖాన్, నరసింహులు, లక్ష్మన్న, ఈశ్వరయ్య, కృష్ణయ్యతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవత్వమే మతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

**- నిసార్ యాసిన్ ఖాన్**

**- నల్లచెరువు అయ్యప్ప స్వాముల అన్నదానానికి 250 కేజీల బియ్యం అందజేత**



నవంబర్ 13, నల్లచెరువు:
నల్లచెరువులో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్ర అన్నదాన కార్యక్రమానికి నూతన యువజన ప్రజా సేవా నెట్‌వర్క్ (ఎన్‌వైపీఎస్ఎన్) వ్యవస్థాపకులు బి. నిసార్ యాసిన్ ఖాన్ 250 కేజీల బియ్యాన్ని విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా బి. నిసార్ యాసిన్ ఖాన్ మాట్లాడుతూ, అన్నదానం అనేది కేవలం ఆహారాన్ని అందించడం మాత్రమే కాదని, ఆకలితో ఉన్నవారి కడుపు నింపుతూ మానవత్వాన్ని చాటే గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు.భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవాభావం కలిసినప్పుడే సమాజంలో నిజమైన ఐక్యత, సోదరభావం వెల్లివిరుస్తాయని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, అన్ని మతాల పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తమవంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. ఆకలికి మతం లేదు.. అన్నదానానికి కులం లేదు.. సేవకు సరిహద్దులు లేవు అనే నినాదంతో మానవత్వమే మతంగా భావిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ పవిత్ర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నల్లచెరువు అయ్యప్ప స్వాములందరికీ స్వామివారి ఆశీస్సులు కలగాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని బి. నిసార్ యాసిన్ ఖాన్ ఆకాంక్షించారు.తమ సేవను గుర్తించి అభినందనలు తెలిపిన నల్లచెరువు అయ్యప్ప స్వాములందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# హిందూపురంలో సెప్టెంబర్ 24న ఆనందమార్గ ఆధ్యాత్మిక శిబిరం

**- ధ్యానం, యోగా, సాధనపై ప్రత్యేక శిక్షణ**




హిందూపురంనవంబర్ 13: ఆనంద మార్గ ప్రచారక సంఘం ఆధ్వర్యంలో ఆనంద సుపర్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, శ్రీ అక్షయ కల్పవృక్షం సేవాసమితి సంయుక్త సహకారంతో సెప్టెంబర్ 24న హిందూపురంలో ఆనందమార్గ ఆధ్యాత్మిక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పెనుకొండ రోడ్డులోని శ్రీ సరస్వతి విద్యా మందిరం వద్ద ఈ శిబిరం జరగనుంది. ఈ సందర్భంగా ఆనందమార్గ ఆధ్యాత్మిక కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు ధ్యానం, యోగా, సాధన తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో రాగ సాధన, ప్రభాత సంగీతం, ఉపన్యాసం, కీర్తన, త్రిపురార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆచార్య ప్రబోధ ఆత్మబోధనాద్ అవధూత, ఆచార్య సదాశివానాద్ అవధూత, చారుకీర్తి, బీజేపీ నాయకులు సురువు రామాంజనేయులు, ప్రకాష్, మాశ్రిమలై తదితరులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక సాధనపై ఆసక్తి ఉన్నవారు ఈ శిబిరంలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# పెళ్లికి ముందు యువత హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలి

**- బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు సిద్ధంగా ఉంచాలి**
**- జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్**

పుట్టపర్తి, నవంబర్ 13:వివాహానికి ముందు యువతీ యువకులు స్వచ్ఛందంగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశంలో ఆయన హెచ్‌ఐవీ నియంత్రణ చర్యలు, బ్లడ్ బ్యాంకుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, హెచ్‌ఐవీ ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షల సంఖ్య పెంచాలని, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి వెంటనే ఏఆర్‌టీ చికిత్స అందించాలని సూచించారు. పెళ్లికి ముందు పరీక్షల ప్రాధాన్యతపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడా రక్తం కొరత తలెత్తకుండా బ్లడ్ బ్యాంకుల్లో తగిన నిల్వలు ఉంచుకోవాలని, తరచూ స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. వివిధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో హెచ్‌ఐవీ పరీక్షలు, నివారణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

# సజ్జల ను కలిసిన మావిగన్ టీవీ యజమాని సుధాకర్ రెడ్డి



విజయవాడ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం మావిగన్ టీవీ యజమాని సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మావిగన్ టీవీ ఛానల్ గురించి ఛానల్ ద్వారా ప్రజలకు అందిస్తున్న వార్తా సమాచార కార్యక్రమాల గురించి సజ్జల రామకృష్ణారెడ్డికి వివరించారు. మావిగన్ టీవీ గురించి తెలుసుకున్న సజ్జల రామకృష్ణారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సుధాకర్ రెడ్డి తెలిపారు.ప్రజలకు మరింత చేరువగా వార్తలు సమాచారాన్ని అందించేందుకు మావిగన్ టీవీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఛానల్‌ను లైక్ చేసి సబ్‌స్క్రైబ్ చేసి ప్రోత్సహించాలని సుధాకర్ రెడ్డి కోరారు.

## రాప్తాడు బాలికకు వైయస్ జగన్ అండ



తాడేపల్లి, నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలో గోపికను రక్షించే ప్రయత్నంలో గాయపడిన లక్ష్మిని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించి, ఆమె కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి లక్ష్మి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, వైయస్ఆర్‌సీపీ తరఫున రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కుటుంబానికి అవసరమైన సమయంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్ట్ అక్రమం, అన్యాయం

-వైసీపీ నాయకులు



గుంటూరు,: ఎన్నికల సమయంలో బ్యాలెట్ బాక్సును అక్రమంగా తరలించే ప్రయత్నాన్ని అడ్డుకున్న వైయస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని జైలుకు పంపడం కూటమి ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. గుంటూరు సబ్‌జైలులో ఉన్న వైయస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని పార్టీ ఎమ్మెల్సీలు పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి వారు అక్కడే మీడియాతో మాట్లాడారు. బ్యాలెట్ బాక్సును బయటకు తీసుకొచ్చిన అధికారులను వదిలేసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రయత్నించిన వారిపై హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులతో గొంతు నొక్కాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, పోలీసు వ్యవస్థను రాజకీయ కక్షసాధింపులకు ఉపయోగించుకుంటోందని మండిపడ్డారు. జైలులో ఉన్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి చట్టపరంగా దక్కాల్సిన కనీస సౌకర్యాలు, రక్షణ కూడా కల్పించడంలేదని మండిపడ్డారు. బాధ్యులైన అధికారుల తీరుపై త్వరలో ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. లేళ్ల అప్పిరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయపోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించిన వారిలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, తలశిల రఘురాం, వరుదు కళ్యాణి, సిపాయి సుబ్రహ్మణ్యం, కేఆర్‌జే భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ యాదవ్, రూహుల్లా, కల్పలతా రెడ్డి, మంగమ్మ, ఇసాక్ బాషా, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

# పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి


**-జిల్లా పరిషత్ సీఈఓ పి. సుశీల**



విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో మండల ప్రజా పరిషత్‌లకు సంబంధించి కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికతో పాటు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికల ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.సుశీల ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. గురువారం విజయవాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ పి.సుశీల మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు తమ బాధ్యతలను పూర్తి అవగాహనతో, అప్రమత్తంగా నిర్వర్తించాలని తెలిపారు. కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలకు సంబంధించిన విధివిధా నాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు.ఎన్నికల నోటీసుల జారీ, సమావేశాలకు అవసరమైన కోరం నిర్ధారణ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, ఓటింగ్, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అధికారులకు వివరించారు. సమాన ఓట్లు వచ్చిన సందర్భంలో లాటరీ ద్వారా విజేతలను నిర్ణయించే విధానం, రాజకీయ పార్టీల అభ్యర్థుల అధికారిక గుర్తింపు పత్రాలు, పార్టీ విప్ జారీ, అమలు, ఎన్నికల సమావేశాల నిర్వహణ, ఫలితాల ప్రకటన, రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికలను సజావుగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకొని, తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి కృషి చేయాలని సీఈఓ పి. సుశీల సూచించారు.

# ప్రజాబలంపై నమ్మకముంటే ఉప ఎన్నికకు రావాలి


**-ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం, జడ్పీటీసీ ఎన్నికపై గన్నవరం నియోజకవర్గంలో గత నాలుగైదు రోజులుగా సామాజిక మాధ్యమాలు, కొన్ని పత్రికల్లో జరుగుతున్న అసత్య ప్రచారాలు, పెయిడ్ ట్రోలింగ్‌పై ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరంలో కూటమి సాధించిన విజయాలను విస్మరించి, కేవలం 63 ఓట్ల తేడాతో గెలిచిన ఒక జడ్పీటీసీ స్థానాన్ని పట్టుకుని వైసిపి నాయకులు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ నాయకులకు నిజంగా ప్రజాబలంపై నమ్మకం ఉంటే 63 ఓట్లతో గెలిచిన జడ్పీటీసీ సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించి ఉప ఎన్నికకు రావాలని యార్లగడ్డ సవాల్ విసిరారు. ఉప ఎన్నికలో కూటమి అభ్యర్థి గెలవకపోతే ఐదు నిమిషాల్లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచే తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. తాను గన్నవరంలో అడ్డదారిలో గెలవలేదని, పదేళ్లుగా చేసిన కష్టానికి, ప్రజల ఆదరణకు ప్రతిఫలంగానే విజయం సాధించానని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో కూటమి ధర్మానికి కట్టుబడి నాలుగు జడ్పీటీసీ స్థానాల్లో రెండింటిని బీజేపీ కి కేటాయించిన ఎమ్మెల్యేను తానేనని యార్లగడ్డ తెలిపారు. కూటమి ఐక్యత కోసం జనసేనకు 18 ఎంపీటీసీ, ఒక ఎంపీపీ స్థానాలు కేటాయించామని వివరించారు. బాపులపాడు మండలంలో 1995 తర్వాత దాదాపు 27 ఏళ్లకు తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి చింతల వెంకట అప్పారావు 5,500కు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని గుర్తుచేశారు. కూటమి భాగస్వామ్య పక్షాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ ఎన్నికల్లో ముందుకు సాగామని చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో కూటమి 37,625 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిందని, మొత్తం ఓట్లలో కూటమికి 56 శాతం, వైసిపి 41 శాతం వచ్చాయని యార్లగడ్డ వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమికి 53.2 శాతం అంటే 53,250 ఓట్లు, వైసిపి 38 శాతం అంటే 35,260 ఓట్లు వచ్చాయని తెలిపారు. ఈ గణాంకాల ప్రకారం కూటమికి సుమారు 18 వేల ఓట్ల ఆధిక్యం ఉందని, ఓట్ల శాతంలోనూ 15 శాతం వ్యత్యాసం కొనసాగిందని పేర్కొన్నారు. గన్నవరం జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు సమయంలో చెల్లని ఓట్లను కూడా లెక్కలోకి తీసుకోవడం, కౌంటింగ్ కేంద్రం నుంచి ఏజెంట్లను బయటకు పంపడం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయని యార్లగడ్డ ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి కుమారస్వామి కేవలం 63 ఓట్ల తేడాతో ఓటమి చెందడం బాధ కలిగించిందన్నారు. ఓట్ల బదిలీలో జరిగిన లోపాలే ఈ ఫలితానికి కారణమని పేర్కొంటూ, ఆ ఓటమికి పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు. ధనబలానికి ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీ కోసం కష్టపడిన సాధారణ కార్యకర్తలకు పదవులు కల్పించామని యార్లగడ్డ వివరించారు. సాధారణ బూత్ ఏజెంట్‌గా పనిచేసిన తిరువీధి నరేష్ భార్యకు గన్నవరం ఎంపీపీ పదవి కల్పించామని, విజయవాడ రూరల్‌కు 30 ఏళ్ల యువకుడు పరుచూరు నరేష్‌కు అవకాశం ఇచ్చామని తెలిపారు. రాజకీయాల్లో సాధారణ కార్యకర్తలకు, యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు.

# ఎన్నికల వ్యయ నియంత్రణ, ప్రలోభాల నివారణపై ప్రత్యేక నిఘా ఉంచాలి

**-ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయ కుమార్**



విజయవాడ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ కుమార్ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి దశకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13న సమగ్ర నోటిఫికేషన్లు జారీ చేయనున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ మార్గదర్శకాలు, ఎన్నికల వ్యయ పరిశీలకులు చేపట్టాల్సిన విధులపై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు దిశానిర్దేశం చేశారు. అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితులకు లోబడి ఖర్చు చేసేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అభ్యర్థుల వ్యయ రిజిస్టర్లతో పాటు షాడో రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువులో వ్యయ వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, బహుమతులు, ఇతర కానుకల పంపిణీ వంటి ప్రలోభాలను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్ బృందాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎన్నికల సభలు, ర్యాలీలు, వాహనాల వినియోగం, ప్రచార సామగ్రికి సంబంధించిన అనుమతులను నిశితంగా పరిశీలించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బి.విజయ కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తామన్నారు.

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సోషల్ మీడియాలో వైఎస్ జగన్, కుటుంబ సభ్యులపై అసభ్యకర వ్యాఖ్యలు



విజయవాడ, సోషల్ మీడియాలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కుటుంబ సభ్యులపై జనసేన పార్టీ వారు అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రాష్ట్ర సోషల్ మీడియా ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దొడ్డ అంజిరెడ్డి, తదితరులు గురువారం సైబర్ క్రైమ్ పోలీసులకు వైసీపీ నేతల ఫిర్యాదు చేశారు. దేవినేని అవినాష్, మాట్లాడుతూ జనసేన పార్టీ వ్యక్తులు జగన్ కుటుంబ సభ్యులపై మాట్లాడిన తీరు ఆక్షేపణీయం. కేవలం ఫిర్యాదు మంత్రమే కాకుండా పూర్తి ఆధారాలు సమర్పించాం. ట్విట్టర్ స్పేస్ లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారి ఆధారాలు ఇచ్చాం. వాళ్లను అరెస్టు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం పై ఉంది. హోస్ట్ చేసిన వారి వివరాలు మొత్తం అందించాం. మహిళల పట్ల తప్పు జరిగితే ఊరుకోం అని ప్రభుత్వ పెద్దలు మాట్లాడుతారు.

ఆర్గనైజ్డ్ గా మా పార్టీ అధినేతపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు.పూర్తి వీడియో, ఆడియో ఆధారాలు సమర్పించాం. మా పార్టీ సోషల్ మీడియా నేతలపై గతంలో అకారణంగా 800 పైగా కేసులు పెట్టారు. 24 గంటల్లో చర్యలు తీసుకోకుంటే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం.

పవన్ కళ్యాణ్ వ్యక్తిగత ఇష్యూపై మాట్లాడవద్దని మా పార్టీ అధినేత జగన్ ఆదేశించారు. 24 గంటలు గడవకముందే జనసేన నేతలు ఇష్టానుసారం మాట్లాడటం సరికాదు.

## ఏపీలో ప్రజాస్వామ్యమే అంతమైపోయిందా?



ఢిల్లీ: బీజేపీ సీనియర్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు సుబ్రహ్మణ్యస్వామి సంచలన ట్వీట్ చేశారు. ఏపీలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అరాచకం, అక్రమాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసలు ఏపీలో ప్రజాస్వామ్యం ఉందా.. అంతమై పోయిందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలోని ఏపీలో రాజ్యాంగ బద్ధమైన పాలన స్థానంలో అరాచక పాలన నడుస్తుందా? అని ప్రశ్నించారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో జరిగిన ఆందోళనలపై ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన స్థానంలో అడవిలో రాజ్యం నడుస్తోందా?, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా స్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేశారా?, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగే ఎన్నికలే ప్రజాస్వామ్యానికి పునాది. రాజకీయ అధికారాన్ని కాపాడుకోవడం కోసం వాటిని బలిపీఠం ఎక్కించకూడదు. ఎన్నికల సమగ్రతను, పారదర్శకతను కాపాడేందుకు కఠినమైన, అమలు చేయదగిన మార్గదర్శకాలను రూపొందించాలి. దీనిపై నేను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా' అని పేర్కొన్నారు.

## మహిళా ప్రయాణికులకు
## టీజీఎస్ ఆర్టీసీ గుడ్‌న్యూస్..





హైదరాబాద్, నవంబర్ 13: తెలంగాణ మహిళా ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ గొప్ప శుభవార్త అందించింది. ఇప్పటికే 'మహాలక్ష్మి' పథకం కింద పల్లెవెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న సంస్థ.. తాజాగా ఏసీ బస్సుల్లోనూ రాయితీ ప్రకటించింది. మంత్లీ బస్ పాస్ తీసుకునే మహిళలు ఇకపై 15 రోజుల ఛార్జీ చెల్లిస్తే.. నెలరోజుల పాటు ఏసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించింది. దీంతో ఏసీ బస్సుల్లో ప్రయాణించాలనుకునే మహిళలకు ఆర్థిక భారం తగ్గనుంది. సాధారణ బస్సులతో పాటు ఏసీ సర్వీసుల్లోనూ రాయితీ అందుబాటులోకి రావడంతో మహిళా ప్రయాణికులకు మరింత వెసులుబాటు కలగనుంది. రోజూ ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే మహిళలకు ఈ నిర్ణయం ప్రయోజనకరంగా ఉండనుంది.

మరోవైపు.. బస్ పాస్ వినియోగదారులను ప్రోత్సహించేందుకు టీజీఎస్ ఆర్టీసీ మరిన్ని ప్రయోజనాలను ప్రకటించింది. మొత్తం 9 రకాల రాయితీలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు అందుబాటు ధరల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు బస్ పాస్‌ల వినియోగాన్ని పెంచడమే ఈ నిర్ణయాల వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా ఆదరణ పొందుతున్న ఆర్టీసీ.. తాజాగా ఏసీ బస్సుల్లో రాయితీలు, ఇతర పాస్ సదుపాయాలతో మరింత మందికి చేరువయ్యే ప్రయత్నం చేస్తోంది. ప్రకటించిన కొత్త ఆఫర్లు శనివారం నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ స్పష్టం చేసింది.

## పొడవైన తీరం, పోర్టులతో
## ఏపీకి చాలా ఉపయోగం
### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

దేశాభివృద్ధికి పోర్టులు చాలా ముఖ్యమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పొడవైన సముద్రతీరం, పోర్టులు ఉండడం ఏపీకి చాలా ఉపయోగంగా ఉందన్నారు. ఏపీలో పోర్టులను మరింత అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలో రెండో రోజు జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడారు. హైవేలు, గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు ఏపీ అభివృద్ధిలో ఎంతో ఉపయోగంగా మారాయన్నారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలను కలిపేందుకు కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. వచ్చే జనవరి నాటికి బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పూర్తి చేస్తామని, ఈ ఎక్స్‌ప్రెస్ వేతో ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటకకూ లాభం చేకూరుతుందని చెప్పారు. ఖరగ్‌పూర్-అమరావతి కారిడార్ వస్తే.. విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం పోర్టులకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి అన్నారు. అమరావతిలో 192 కి.మీ. రింగ్‌రోడ్ వస్తోందని వెల్లడించారు. బెంగళూరు-విజయవాడ కారిడార్‌తో 110 కిలోమీటర్ల దూరం తగ్గిందన్నారు. అలాగే రాయ్‌పూర్-విశాఖ కారిడార్ ప్రాజెక్టు 96 శాతం పూర్తయిందని తెలిపారు. ఈ కారిడార్‌తో ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు మేలు జరుగుతుందన్నారు. విశాఖ-మచిలీపట్నం కారిడార్ కూడా ఏపీ అభివృద్ధికి కీలకంగా మారుతుందన్నారు. భవిష్యత్తులో ఏపీ అభివృద్ధిలో పోర్టులే కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి చెప్పారు.

## 16న తెరుచుకోనున్న శబరిమల ఆలయం.. ఈ ఏర్పాట్లన్నీ పూర్తి



తిరువనంతపురం: రాబోయే మండల-మకరవిళక్కు సీజన్‌లో శబరిమలలో యాత్రికులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్ తెలిపారు. శబరిమల ఆలయం నవంబర్ 16న సాయంత్రం 4 గంటలకు తెరుచుకుంటుంది. అన్ని ప్రధాన సివిల్ పనులు పూర్తయ్యాయని , కేవలం కొన్ని చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని జయకుమార్ తెలిపారు. యాత్రికులకు విశ్రాంతి అందించేందుకు ట్రెక్కింగ్ మార్గంలో పలుచోట్ల స్టెయిన్లెస్ స్టీల్ సీటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు.నీలక్కల్లో, సుమారు 6,000 మందికి వసతి కల్పించగల జర్మన్ టెంట్ లోపల కూలర్లను ఏర్పాటు చేయనున్నారు. అరవణ ప్రసాదం పంపిణీ కోసం అదనపు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. అదనంగా ఐదు అరవాణ కౌంటర్లకు మంజూరు చేయడంతో, మొత్తం పంపిణీ కౌంటర్ల సంఖ్య 22కు చేరింది. వీటిలో 19 కౌంటర్లను ధనలక్ష్మి బ్యాంక్ , మూడింటిని సౌత్ ఇండియన్ బ్యాంక్ నిర్వహిస్తాయి. సౌత్ ఇండియన్ బ్యాంక్ నిర్వహించే ఐదు అరవణ కియోస్క్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు.


ఈ సేవను అభ్యర్థించే భక్తుల కోసం బోర్డు అరవాణను తపాలా ద్వారా పంపించే సేవను కూడా ప్రవేశపెట్టనుంది. మొత్తం 14 సమర్పణ కౌంటర్లు అందుబాటులో ఉంటాయి. నగదు చెల్లింపులను కూడా స్వీకరించినప్పటికీ, డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇస్తారు. వృశ్చిక మాసం మొదటి రోజు (నవంబర్ 17) ఆలయం తెరిచినప్పుడు 50 లక్షల అరవణ డబ్బాలు అందుబాటులో ఉంటాయని జయకుమార్ తెలిపారు. అప్పం నిల్వలు కూడా తగినంతగా ఉంచుతామని ఆయన చెప్పారు. యాత్రా కాలంలో అరవణ లేదా అప్పం దేనికీ కొరత ఉండదని ఆయన యాత్రికులకు హామీ ఇచ్చారు.

రూ. 2 లక్షల జీవిత బీమా కవరేజీ

యాత్ర సమయంలో మరణం సంభవిస్తే రూ. 2 లక్షల జీవిత బీమా కవరేజీ లభిస్తుందని ఆయన ప్రకటించారు. బుక్ చేసుకున్న తేదీకి ముందు రోజు, ఆ తర్వాత రోజును కూడా పరిగణనలోకి తీసుకుని, మొత్తం మూడు రోజుల కాలానికి ఈ కవరేజీ వర్తిస్తుంది. బుకింగ్ ప్రక్రియ సమయంలో నామినీ వివరాలను సేకరిస్తారు.నెయ్యి సరఫరాపై టీడీబీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. శబరిమలకు సరఫరాలను పునఃప్రారంభించేందుకు మిల్మాకు విజిలెన్స్ క్లియరెన్స్ లభించిందని తెలిపారు. మిల్మా నెయ్యిని కొనుగోలు చేయబోమని తాను గతంలో చేసిన ప్రకటన మానవ బలహీనత కారణంగా చేసి ఉండవచ్చని ఆయన అన్నారు. మిల్మా సొంత సాయుధ వాహనాల్లో శబరిమలకు నెయ్యిని రవాణా చేసి, లీటరుకు రూ. 660 చొప్పున కొనుగోలు చేయనున్నారు.

# హువాంగ్ రాజీనామా

## అనూహ్య పరిణామం, బోర్డు అంగీకరిస్తుందా?



టెక్ దిగ్గజం ఎన్విడియా సహ వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సన్ హువాంగ్ వివాహేతర సంబంధాలు, చైనా గూఢచర్యం ఆరోపణల వివాదంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారం గ్లోబల్‌గా సంచలనం రేపడంతో హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. అయితేకంపెనీ ఉద్యోగులు ఆయనను వెనక్కి తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున ఉద్యమించడం ఆసక్తికరంగా ఉంది. ఆయనపై అభిమానం తగ్గని ఉద్యోగులు 'బాస్‌ను తిరిగి తీసుకురండి' అంటూ గళం విప్పారు. ఈ మేరకు వందలాది ఉద్యోగులు బోర్డుకు లేఖ రాశారు. కొత్త సీఈఓ కోసం అన్వేషిస్తున్న బోర్డు , ఫైనాన్స్ చీఫ్ కోలెట్ క్రెస్‌ను తాత్కాలిక సీఈఓగా నియమించింది. మరి బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

తాజా నివేదికల ప్రకారం ఎన్విడియా అంతర్గత 'సజెషన్ బాక్స్' లో సుమారు 1,600 కామెంట్లు వెల్లువెత్తాయి. ఎన్విడియాను ఏఐ (ూ×) దిగ్గజంగా తీర్చిదిద్దిన జెన్సెన్ హువాంగ్‌కు అండగా నిలుస్తూ చాలామంది ఉద్యోగులు ఆయనను తిరిగి నియమించాలని కోరుతున్నారు. హువాంగ్‌ను తిరిగి తీసుకురావడానికి ఒక మార్గాన్ని కనుగొనాలని చాలా మంది ఉద్యోగులు బోర్డు సభ్యులను కోరారు. లింక్డ్‌ఇన్ వేదికగా కూడా దాదాపు రెండు డజన్ల మంది ఉద్యోగులు హువాంగ్‌కు తమ మద్దతును ప్రకటించారు. అంతేకాకుండా, ఆయన ఎందుకు తప్పుకున్నారనే విషయంపై మరింత పారదర్శకత కావాలని కోరుతూ ఏకంగా ఒక ఉద్యోగి సంస్థలోని అందరికీ ఇమెయిల్ పంపినట్లు సమాచారం .'బాస్‌ను వెనక్కి తీసుకురండి": "మీరు కంపెనీ లక్ష్యాన్ని నమ్మితే, మన బాస్‌ను తిరిగి తీసుకురండి" అని ఒక అజ్ఞాత ఉద్యోగి వ్యాఖ్యానించారు. "మనమందరం మనుషులమే, తప్పులు చేయడం సహజం. జెన్సెన్ ఎన్నో మంచి పనులు చేశారు, ఆయనకు మరో అవకాశం ఇవ్వాలి" అని మరొకరు పేర్కొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..
## 20 మంది విద్యార్థుల మృతి

అసోం, అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోలాఘాట్ జిల్లాలోని రంగాజన్ వద్ద జాతీయ రహదారి 27పై ప్రయాణికులతో వెళ్తున్న వాహనాన్ని కంటైనర్ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో దాదాపు 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న కంటైనర్ ట్రక్కు ప్రయాణికుల వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదానికి గురైన ప్రయాణికుల వాహనంలో ఎక్కువ మంది కళాశాల విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కోహోరా ఆరోగ్య కేంద్రానికి తరలించారు.ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో 20 ఏళ్ల అతుల్ బోరా, 20 ఏళ్ల అరుణ్ కుమార్ ఉన్నట్లు గుర్తించారు. వీరిద్దరూ అదే ప్రాంతానికి చెందినవారని అధికారులు వెల్లడించారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల సంఖ్యపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గాయపడిన వారికి అందుతున్న వైద్య సహాయం, ప్రమాదానికి గల కారణాలపై అధికారుల నుంచి తదుపరి సమాచారం వెలువడాల్సి ఉంది.అసోంలోని కజిరంగా సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కొందరు మరణించినట్లు ప్రాథమిక సమాచారం అందిందని గోలాఘాట్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్వప్ననీల్ డేకా తెలిపారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బస్సులో నుంచి



మృతదేహాలను బయటకు తీస్తున్నామని చెప్పారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కోహోరా మోడల్ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్కు సమీపంలో విధించిన వేగ పరిమితులను ఉల్లంఘిస్తూ బస్సు అత్యంత వేగంగా ప్రయాణిస్తోందని పోలీసు అధికారి తెలిపారు. మినీబస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నట్లు చెప్పారు. దీంతో ఎదురుగా వచ్చిన కంటైనర్ ట్రక్కును బస్సు ఢీకొట్టిందని వివరించారు.

హిమంత బిశ్వ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి

ఈ ఘటనపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కజిరంగాలో ఈ రోజు జరిగిన విషాద ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ప్రాణనష్టం తీవ్రత అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి బాధను ఏ మాటలూ తగ్గించలేవని, ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తామంతా అండగా ఉంటామని, అసోం ప్రజలంతా వారితో నిలబడతారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.




# అదుపు తప్పిన 'ఏఐ ఏజెంట్' పనేనా ఇది?

ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నవంబర్ 12న ప్రారంభమైన ఈ సమస్యతో 74 దేశాల్లోని వినియోగదారులు ఔట్‌లుక్, మైక్రోసాఫ్ట్ టీమ్స్, మైక్రోసాఫ్ట్ 365, కోపైలట్ వంటి సేవలను వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేలాది సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలపైనా ప్రభావం పడింది. 15 గంటలకు పైగా గడిచినా సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇటీవల ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ వంటి సంస్థల ఏఐ ఏజెంట్లు నియంత్రణ తప్పి ప్రవర్తించిన ఘటనల నేపథ్యంలో ఈ అంతరాయానికి కూడా అదుపు తప్పిన 'ఏఐ ఏజెంట్' కారణమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అసలేం జరిగింది?

మైక్రోసాఫ్ట్ ప్రాథమిక సమాచారం ప్రకారం.. కొన్ని సర్వర్లు ఆటోమేటెడ్ హెల్త్ చెక్‌లలో విఫలమై అనూహ్యంగా అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో మిగిలిన సర్వర్లపై ఒక్కసారిగా భారం పెరిగింది. ముఖ్యంగా సురక్షిత కనెక్షన్లను ఏర్పాటు చేసే ప్రక్రియలోని కొన్ని భాగాలు అధిక ఒత్తిడికి గురై అభ్యర్థనలను ప్రాసెస్ చేయలేకపోయాయి. ఇటీవల చేసిన నెట్‌వర్క్ కాన్ఫిగరేషన్ మార్పులు కూడా సమస్యకు కారణమై ఉండొచ్చని సంస్థ పరిశీలిస్తోంది.

ప్రభావిత సర్వర్లను పునఃప్రారంభించినప్పటికీ, వాటిపై ట్రాఫిక్ తిరిగి పెరిగినప్పుడు మళ్లీ స్పందించడం ఆగిపోయింది. దీంతో సేవల పునరుద్ధరణ ఆలస్యమైంది. సమస్యను పరిష్కరించేందుకు పాత సాఫ్ట్‌వేర్ కాన్ఫిగరేషన్‌తో కొన్ని సర్వర్లను పునర్నిర్మించడం, ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లించడం వంటి చర్యలు చేపట్టింది. నవంబర్ 13న సర్వర్ల స్థిరత్వం మెరుగుపడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది.

ఏఐ ఏజెంట్లపై ఎందుకీ అనుమానాలు?

ఇటీవల ఏఐ ఏజెంట్ల సామర్థ్యాలు, వాటి నియంత్రణపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా 2026 జులైలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో ఓపెన్‌ఏఐకి చెందిన కొన్ని పరిశోధక ఏఐ ఏజెంట్లు తమకు కేటాయించిన పరిమితులను దాటి, హగ్గింగ్ ఫేస్ సహా ఇతర వ్యవస్థల్లోకి ప్రవేశించినట్లు సంస్థ వెల్లడించింది. కొన్ని సర్వర్లలో ఉన్నత స్థాయి యాక్సెస్ కూడా పొందాయి. ఈ ఘటన ఏఐ వ్యవస్థలకు అతిగా అనుమతులు ఇస్తే ఎలాంటి ప్రమాదాలు ఎదురవుతాయో తెలియజేసింది.

# మూడు రోజుల లాభాలకు బ్రేక్ నష్టాల్లో ముగిసిన సూచీలు!




మూడు రోజుల పాటు సాగిన దేశీయ స్టాక్ మార్కెట్ల జోరుకు బ్రేక్ పడింది. ఇవాళ(శుక్రవారం) సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయాన్నే నష్టాలతో మొదలై, రోజంతా అదే ధోరణిని కొనసాగించింది.ఇంట్రాడేలో 81,288.75 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 318.56 పాయింట్ల నష్టంతో 81,592.45 వద్ద ముగిసింది. ఒక దశలో మరింత పడిపోయిన సెన్సెక్స్, చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి స్వల్పంగా నష్టపోయింది. రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న వార్తలు మదుపర్లను ఆందోళనకు గురిచేశాయి. దీనికి తోడు ఇటీవల మార్కెట్లు లాభాల్లో ఉండటంతో ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్ (లాభాల స్వీకరణ) వైపు మొగ్గు చూపారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఐటీ రంగాల షేర్లపై అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది.

నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలో నడిచి నష్టాలతో ముగిసింది. 155.05 పాయింట్ల నష్టంతో 25,144.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.24గా ఉంది. మరోవైపు, అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ బలహీనపడింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బీఈఎల్ వంటి ప్రముఖ షేర్లు నష్టపోగా.. హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం స్వల్ప లాభాలను దక్కించుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిడ్ ధరలు ఎగబాకడం, బంగారం రేట్లు పెరగడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95.42 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3897.70 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# ఎయిర్ ప్యూరిఫైర్లను ఉపయోగిస్తే షుగర్

నిద్రించే సమయంలో గాలిలోని కాలుష్య కణాలను తొలగించే గాలి శుద్ధి యంత్రాలను ఉపయోగించడం వల్ల మధుమేహానికి ముందు దశలో ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ మెరుగుపడుతుందని తాజా అధ్యయనం సూచిస్తోంది. ముఖ్యంగా రోజంతా రక్తంలో చక్కెర స్థాయిల్లో వచ్చే హెచ్చుతగ్గులు తగ్గడంతోపాటు, ఉదయం అల్పాహారం తర్వాత చక్కెర ఒక్కసారిగా పెరిగే పరిస్థితి కూడా తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం అమెరికన్ హార్ట్ జర్నల్ లో ప్రచురితమైంది. సాధారణ స్థాయి కంటే రక్తంలో చక్కెర ఎక్కువగా ఉన్నప్పటికీ, మధుమేహం నిర్ధారణ కాని పరిస్థితిని మధుమేహ పూర్వ దశ (ప్రీ డయాబెటిస్)గా పరిగణిస్తారు. ఈ దశలో ఉన్నవారికి భవిష్యత్తులో మధుమేహం, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రోజంతా చక్కెర స్థాయిల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు కూడా ఆరోగ్య సమస్యలను మరింత పెంచుతాయి.

అధ్యయనంలో ఏం తేలింది..?

అమెరికాలోని న్యూయార్క్ విశ్వవిద్యాలయ పరిశోధకుల నేతృత్వంలో ఈ అధ్యయనం జరిగింది. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోయే సమస్య లేని మధుమేహ పూర్వ దశలో ఉన్న 150 మందికి పైగా పురుషులు, మహిళలను పరిశీలించారు. గాలి కాలుష్యానికి గురికావడం వల్ల మధుమేహ పూర్వ దశతోపాటు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతుందని గత పరిశోధనలు సూచించాయి. అయితే ఇంట్లో అధిక సామర్థ్యం కలిగిన గాలి వడపోత పరికరాలను ఉపయోగించడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణ మెరుగుపడుతుందా అనే విషయంపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో పరిశోధకులు గాలి శుద్ధి యంత్రాల ప్రభావాన్ని పరిశీలించారు. అధిక సామర్థ్యం గల సూక్ష్మ కణాల వడపోత పరికరాలు 0.3 మైక్రాన్ల పరిమాణం కలిగిన గాలిలోని కణాల్లో 99 శాతానికి పైగా తొలగించగలుగుతాయి.

గాలి శుద్ధి పరికరాలతో మేలు..

అధ్యయనంలో పాల్గొన్న వారిలో సగం మంది సుమారు నెల రోజుల పాటు తమ పడకగదిలో నిజమైన గాలి శుద్ధి పరికరాలను ఉపయోగించారు. మిగిలిన వారు గాలిని శుద్ధి చేయని నకిలీ పరికరాలను ఉపయోగించారు. నిజమైన పరికరాల వల్ల గాలిలోని హానికరమైన సూక్ష్మ కణాల స్థాయి 36 శాతం తగ్గింది. పరిశోధనలో పాల్గొన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను ప్రతి కొన్ని నిమిషాలకు నమోదు చేసే చిన్న పరికరాలను ధరించారు. గాలి శుద్ధి ప్రక్రియ ప్రారంభానికి ముందు ఒక వారం పాటు, నాలుగు వారాల తర్వాత మరోసారి వారి చక్కెర స్థాయిలను పరిశీలించారు. గాలి శుద్ధి చేసిన గదుల్లో నిద్రించినవారిలో రోజువారీ చక్కెర హెచ్చుతగ్గులు తగ్గినట్లు గుర్తించారు. అల్పాహారం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు గరిష్ఠంగా పెరిగే పరిమాణం కూడా తగ్గింది. భోజనం తర్వాత రక్తంలో అదనంగా పెరిగే చక్కెర పరిమాణం



సగటున తగ్గినట్లు పరిశోధకులు తెలిపారు.

డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు..

ఇంట్లో, ముఖ్యంగా పడకగదిలో స్వచ్ఛమైన గాలి ఉండడం మధుమేహ పూర్వ దశలో ఉన్నవారికి రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన గుండె వైద్య నిపుణురాలు షరైన్ ఎల్.విట్‌కాప్ పేర్కొన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, వైద్యులు సూచించిన మందు లు వాడడంతోపాటు గాలి శుద్ధి పరికరా లను ఉపయోగించడం కూడా గుండె, జీవక్రియ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తోడ్పడతాయని ఆమె వివరించారు.

గాలి కాలుష్యం ఊపిరితిత్తులకే కాకుండా గుండె, జీవక్రియ సంబంధిత ఆరోగ్యానికీ ముప్పుగా మారుతోందని మరో పరిశోధకుడు జోనాథన్ న్యూమన్ తెలిపారు.

ఇంటి లోపలి గాలి నాణ్యతను కూడా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పరిగణిం చాలని వైద్యులకు ఈ ఫలితాలు సూచిస్తున్నాయని చెప్పారు.

# చిన్నతనంలో కొన్ని టీకాలు వేయించుకోని వారు పెద్దయ్యాక తీసుకోవచ్చా..

చిన్నతనంలో వేయించుకోవాల్సిన టీకాలు సమయానికి తీసుకోలేకపోయినంత మాత్రాన వ్యాధుల నుంచి రక్షణ పొందే అవకాశం పూర్తిగా కోల్పోయినట్లు కాదు. కొన్ని టీకాలను పెద్దయ్యాక కూడా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వయసు, గతంలో తీసుకున్న టీకాల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించిన తర్వాత వైద్యులు అవసరమైన టీకాలను సూచిస్తారు. చిన్నతనంలో అనారోగ్యం, అవగాహన లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు లేదా వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొందరు పిల్లలకు టీకాలు సకాలంలో అందవు. మరికొందరికి చిన్నతనంలో ఏయే టీకాలు వేయించారో సరైన రికార్డులు కూడా ఉండవు. అయితే దీనివల్ల జీవితాంతం ఆ వ్యాధుల నుంచి రక్షణ పొందలేమని భావించకూడదు. తప్పిపోయిన టీకాలను తర్వాత వేయించుకునే విధానాన్ని క్యాచ్-అప్ వ్యాక్సినేషన్ అంటారు. వయసు పెరిగేకొద్దీ రోగనిరోధక శక్తి తగ్గడం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉండడం వల్ల పెద్దలకు కూడా కొన్ని ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వారు ఇన్ఫెక్షన్లకు గురైతే ఇంట్లోని పిల్లలు, వృద్ధులకు కూడా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుంది.

టీకాలకు పరిమితులు ఉంటాయా..

చిన్నతనంలో మిస్సైన ప్రతి టీకాను పెద్దయ్యాక తీసుకోవచ్చని మాత్రం అనుకోకూడదు. కొన్ని టీకాలకు వయోపరిమితులు ఉంటాయి. మరికొన్ని నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు లేదా ప్రమాద కారకాలు ఉన్నవారికే సిఫారసు చేస్తారు. హెపటైటిస్ బి టీకా కాలేయాన్ని ప్రభావితం చేసే వైరస్ నుంచి రక్షణ కల్పిస్తుంది. చిన్నతనంలో ఈ టీకా తీసుకోని వారు లేదా పూర్తి మోతాదులు తీసుకోని వారికి వైద్యులు సూచిస్తారు. హెపటైటిస్ ఎ టీకా కలుషితమైన ఆహారం, నీటి ద్వారా వ్యాపించే వైరస్ నుంచి రక్షణ ఇస్తుంది. గతంలో టీకా తీసుకోని వారు, రోగనిరోధక శక్తి లేని వారు, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారు దీన్ని తీసుకోవాల్సి వస్తుంది.మీజిల్స్, గవదబిళ్లలు, రుబెల్లా వ్యాధుల నుంచి రక్షణ ఇచ్చే ఎంఎంఆర్ టీకా కూడా అవసరమైన పెద్దలకు సూచిస్తారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది, ఈ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉన్నవారు తమ టీకాల వివరాలను పరిశీలించుకోవాలి. గతంలో చికెన్‌పాక్స్ రాని, దానికి టీకా తీసుకోని పెద్దలకు వరిసెల్లా టీకా అవసరమవుతుంది. పిల్లలతో పోలిస్తే పెద్దలలో చికెన్‌పాక్స్ వల్ల కొన్నిసార్లు తీవ్రమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.


ఈ వ్యాధులకు అవసరమే..

ధనుర్వాతం, డిఫ్తీరియా, కోరింత దగ్గు నుంచి రక్షణ



ఇచ్చే టీడాప్ టీకా కూడా ముఖ్యమైనదే. యుక్తవయసులో ఈ టీకా తీసుకోని పెద్దలకు ఒక మోతాదు అవసరమవుతుంది. ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు ధనుర్వాతం, డిఫ్తీరియా నివారణకు బూస్టర్ మోతాదులు తీసుకోవాలి. గర్భిణులు ప్రతి గర్భధారణ సమయంలో టీడాప్ టీకా తీసుకోవాలని సూచిస్తారు. దీనివల్ల పుట్టబోయే బిడ్డకు కోరింత దగ్గు నుంచి రక్షణ లభిస్తుంది. హెచ్‌పీవీ టీకా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు మరికొన్ని క్యాన్సర్లకు కారణమయ్యే వైరస్ రకాల నుంచి రక్షణ కల్పిస్తుంది. సాధారణంగా యుక్తవయసులో వేయించడం ఉత్తమమైనప్పటికీ, వయసు, గతంలో తీసుకున్న టీకాల వివరాల ఆధారంగా కొందరు పెద్దలకు కూడా ఇది ఉపయోగపడుతుంది.

# బరువు తగ్గించే మందులను వైద్య సలహా లేకుండా వాడితే ప్రమాదం.. ఎందుకంటే..?



బరువు తగ్గించే ఇంజెక్షన్లు ఊబకాయం, టైప్-2 మధుమేహం చికిత్సలో కొత్త మార్పులు తీసుకొస్తున్నాయి. జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగోనిస్టులు, డ్యుయల్ జీఐపీ, జీఎల్‌పీ-1 అగోనిస్టులు వంటి ఆధునిక ఔషధాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతోపాటు ఆకలిని తగ్గించి, గణనీయంగా బరువు తగ్గేందుకు సహాయపడతాయి. ఎంపిక చేసిన రోగుల్లో గుండె, మూత్రపిండాల సమస్యల ముప్పును కూడా తగ్గించవచ్చు. అయితే ఈ ఇంజెక్షన్లు అందరికీ సరిపోవు. వీటిని సూచించే ముందు వైద్యులు రోగి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలిస్తారు. కేవలం బరువు తగ్గాలనే కోరికతో ఈ మందులు వాడకూడదని, ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాలను బట్టి చికిత్స నిర్ణయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

బరువు తక్కువగా ఉన్నా టైప్ 2 డయాబెటిస్..

ముందుగా వ్యక్తి ఎత్తు, వయసుకు అనుగుణంగా బరువు, శరీర ద్రవ్యరాశి సూచీ (బీఎంఐ), శరీరంలో కొవ్వు పంపిణీని పరిశీలిస్తారు.

భారతీయుల్లో కొందరికి బీఎంఐ సాధారణంగా ఉన్నప్పటికీ అంతర్గత అవయవాల చుట్టూ అధిక కొవ్వు పేరుకుపోయి టైప్-2 మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల బరువుతోపాటు శరీరంలో కొవ్వు స్థాయిలను కూడా అంచనా వేస్తారు. వయసును బట్టి చికిత్సను నిర్ణయిస్తారు. వృద్ధుల్లో అధిక బరువు తగ్గడం, కండరాలు క్షీణించడం, నీరసం, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

అలాగే మధుమేహం తీవ్రతను తెలుసుకునేందుకు హెచ్‌బీఏ1సీ, ఉపవాస రక్తంలో చక్కెర, భోజనం తర్వాత చక్కెర స్థాయిలు, వ్యాధి వ్యవధి, ప్రస్తుతం వాడుతున్న మందులను పరిశీలిస్తారు. జీవనశైలి మార్పులు, ట్యాబ్లెట్లను వాడినా చక్కెర నియంత్రణలో లేనివారికి ఈ ఇంజెక్షన్లు ఉపయోగపడతాయి. కొందరికి మెట్‌ఫార్మిన్ వంటి సాధారణ మందులే సరైన చికిత్సగా కొనసాగుతాయి.

ఎవరు ఈ మందులను వాడకూడదు..?

రోగికి ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలను కూడా వైద్యులు పరిగణనలోకి తీసుకుంటారు. ఊబకాయం వల్ల వచ్చే సమస్యలు, ఫ్యాటీ లివర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు ఉన్నవారికి ఈ మందుల వల్ల అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. అయితే కొన్ని జీర్ణకోశ సమస్యలు, హార్మోన్ల సంబంధిత వ్యాధులు ఉన్నవారికి ఇవి సరిపోవు. రక్తపోటు, కొలెస్ట్రాల్, నడుము చుట్టుకొలత, ఇన్సులిన్ నిరోధకత, గుండె సంబంధిత ముప్పును కూడా అంచనా వేస్తారు. సన్నగా కనిపించినప్పటికీ అంతర్గతంగా అధిక కొవ్వు కలిగిన వారిలో బరువు కంటే జీవక్రియ ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

జీవనశైలి కూడా ముఖ్యమే..

ఈ ఇంజెక్షన్లు మాత్రమే వాడితే బరువు తగ్గుతుందని భావించకూడదు. ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత ప్రోటీన్, క్రమం తప్పని వ్యాయామం, నాణ్యమైన నిద్ర, జీవనశైలిలో మార్పులు తప్పనిసరి. చికిత్స సమయంలో వైద్యులను క్రమం తప్పకుండా సంప్రదించాలి.

# వెంట్రుకవాసిలో తప్పిన మృత్యువు..

## 100 అడుగుల క్రేన్ కూలిన వేళ ఏం జరిగిందో చెప్పిన కాజల్ అగర్వాల్!



దాదాపు రెండు దశాబ్దాలుగా దక్షిణాది, ఉత్తరాది ప్రేక్షకులను తన అందం, అభినయంతో అలరిస్తున్న స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంటున్న 'రామాయణ' చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదురైన అత్యంత భయానక సంఘటనను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సుమారు ఆరేళ్ల క్రితం జరిగిన క్రేన్ ప్రమాదంలో తాను తృటిలో ప్రాణాలతో బయటపడిన విషయాన్ని వెల్లడించారు. 2020లో ప్రముఖ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న 'ఇండియన్ 2' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఘోర ప్రమాదం అప్పట్లో చిత్ర పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చెన్నైలోని ఈవీపీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరణ జరుగుతుండగా భారీ క్రేన్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో సెట్‌లోనే ఉన్న కాజల్ అగర్వాల్ కూడా తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. తాజా ఇంటర్వ్యూలో ఆ ఘటనను గుర్తుచేసుకున్న కాజల్.. తన జీవితంలో అదొక ఎప్పటికీ మర్చిపోలేని పీడకల అని పేర్కొన్నారు. ఆరోజు సినిమాలో ఓ కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారని, తాను 80 ఏళ్ల వృద్ధురాలి పాత్ర కోసం ప్రత్యేక ప్రోస్థెటిక్ మేకప్ వేసుకున్నానని తెలిపారు. షూటింగ్ సెట్‌లోని మానిటర్ వద్ద కూర్చుని ఉండగా ఒక్కసారిగా భారీ శబ్దం, ఆర్తనాదాలు వినిపించాయని చెప్పారు. ఏం జరిగిందో అర్థం చేసుకునేలోపే సుమారు 100 అడుగుల ఎత్తున్న భారీ క్రేన్ కుప్పకూలిందని కాజల్ గుర్తుచేసుకున్నారు.

సినిమా న్యూస్

# 'తుంబాడ్' స్టైల్ మేకింగ్ ఆర్ట్‌వర్క్‌తో దడ పుట్టిస్తోంది!




అక్కడ ఒంటరిగా ఒక ఇల్లు.. ఆ ఇంటి చుట్టూ తోట. ఆ తోట ఇంటి వైపే చూస్తుంది. ఆ ఇంట్లో మనుషులు ఏం చేస్తున్నా ఇది గమనిస్తుంది.. ఆ తర్వాత వెన్నులో ఒణుకుపుట్టే సన్నివేశాలు ఒకటొకటిగా దర్శనమిస్తాయి. ఆ తోటలో చాలా రహస్యాలున్నాయి.. భయపెట్టే ఆత్మలు ఉన్నాయి.. అవి అక్కడే ఎందుకు ఉన్నాయి? ఎవరిని ఏం చేయబోతున్నాయి? ఇవన్నీ తెలియాలంటే జాకీ ష్రాఫ్ నటించిన ఈ హారర్ థ్రిల్లర్ సినిమా చూడాల్సిందే. తాజాగా రిలీజైన –కాళీ ఖేతీ– ట్రైలర్ ఆద్యంతం గగుర్పాటుకు గురి చేస్తోంది. ఆస్కార్ విన్నింగ్ సినిమాలా అద్భుతమైన లైటింగ్ స్కీమ్.. గుండె దడ పుట్టించే రీరికార్డింగ్ తో విజువల్స్ కేక పుట్టిస్తున్నాయి. ఒక హారర్ సినిమాకి లైటింగ్, ఆర్ట్ వర్క్, సినిమాటోగ్రఫీ, నేపథ్య సంగీతం ఎంత ముఖ్యమో.. అవన్నీ సరిగ్గా సెట్టయితే ఎలా ఉంటుందో ఈ ట్రైలర్ చెబుతోంది. ాశ్రీంశీ =ముఃం – షాకింగ్: 2 కోట్ల బడ్జెట్ సినిమాకి 63 కోట్ల శాటిలైట్ ధర? నవంబర్ 20న పీవీఆర్ ఐనాక్స్ ద్వారా థియేటర్లలో విడుదల కానున్న–కాళీ ఖేతీ– సైకలాజికల్ రూరల్ హారర్ డ్రామాతో ఆద్యంతం రక్తి కట్టించనుందని తాజా ట్రైలర్ చెబుతోంది. బ్లాక్‌కాన్వాస్ స్టూడియో బ్యానర్‌పై హారిస్ ఇంతియాజ్ ఖాన్ రచించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రం సాధారణ హారర్ సినిమాలకు భిన్నంగా..

ఒక మారుమూల వ్యవసాయ గ్రామంలో నడుస్తుంది. శాపగ్రస్తమైన ఒక పొలం చుట్టూ తిరిగే భయానక రహస్యాలు ఏమిటన్నది తెరపైనే చూడాలి. కిరణ్ దేవ్‌హాన్స్ సినిమాటోగ్రఫీ, అలకానంద దాస్‌గుప్తా సంగీతం ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. ఈ సినిమాలో ఫ్యామిలీ పూర్వీకుల ఆత్మలు.. వాటి వెనక దాగి ఉన్న నిజాలు రక్తి కట్టిస్తాయి. అతీంద్రియ శక్తుల మధ్య చిక్కుకున్న తండ్రీకొడుకులుగా జాకీ ష్రాఫ్, శరద్ కేల్కర్ కనిపించనున్నారు.

# టాలీవుడ్‌లో మరో వాయిదా.. రష్మిక 'మైసా' రిలీజ్ డేట్ మారనుందా?



టాలీవుడ్‌లో సినిమాల వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే పలు భారీ చిత్రాలు అనుకున్న తేదీలకు రాలేకపోతుండగా, తాజాగా ఆ జాబితాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీ 'మైసా' కూడా చేరినట్లు ఫిలిం నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో రష్మిక తొలిసారిగా ఒక గిరిజన యువతిగా మైసా అనే ఛాలెంజింగ్ పాత్రలో కనిపించనున్నారు. తన జాతికి జరిగిన అన్యాయంపై పోరాడే ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు. డూప్ లేకుండా రిస్కీ ఫైట్ సీక్వెన్స్‌లలో నటించినట్లు ఇటీవల విడుదలైన టీజర్ ద్వారా స్పష్టమైంది. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రష్మిక కెరీర్‌లోనే బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్‌గా మారుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

అయితే, ముందుగా ఈ సినిమాను నవంబర్ 27న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడంతో ఈ విడుదల తేదీ మారే అవకాశం ఉందని తెలుస్తోంది. నవంబర్ 27కి బదులుగా సరిగ్గా వారం రోజులు ఆలస్యంగా డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర యూనిట్ యోచిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై సినిమా నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం వ్యక్తిగత కారణాల వల్ల విదేశీ టూర్‌లో ఉన్న రష్మిక, ఆ ప్రయాణం ముగిసిన వెంటనే సినిమా ప్రమోషన్లలో వేగం పెంచనున్నారు. రావు రమేష్, సముద్రఖని, గురు సోమసుందరం, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

# త్రిగుణ్ 'జంగా' గ్లింప్స్ విడుదల..

శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న సరికొత్త చిత్రం 'జంగా'. కెవిన్ గడ్డం (శ్రీహరి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకులు రాంగోపాల్ వర్మ తాజాగా విడుదల చేశారు. త్రిగుణ్ కెరీర్‌లో ఇది సరికొత్త మైలురాయిగా నిలవనుందని ఈ గ్లింప్స్ చూస్తే స్పష్టమవుతోందిఈ చిత్రంలో త్రిగుణ్ సరసన నేహా పఠాన్ నటించగా, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి, చందు గౌడ, సమీర్, నాగ మహేష్, భూపాల్ రాజు, రఘు కారుమంచి, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కొన్ని లక్షల ఏండ్లు పట్టింది.. పశువు మనిషి అవ్వడానికి.. మళ్లీ పశువు అవుతానంటే నేను ఒప్పుకోను.. మనిషి పశువు అయితే.. మరణం వదం అయితాది' అంటూ త్రిగుణ్ చెప్పిన శక్తివంతమైన డైలాగ్స్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. రా అండ్ రస్టిక్ లుక్‌లో త్రిగుణ్ కనిపిస్తుండగా, మరోవైపు వరలక్ష్మీ శరత్ కుమార్ కూడా పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు.

### 17 ఏండ్ల తర్వాత టాలీవుడ్‌లోకి

# కంగనా రనౌత్..

**రవిబాబు దర్శకత్వంలో క్రేజీ హారర్**




నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో టాలెంటెడ్ డైరెక్టర్ రవిబాబు దర్శకత్వంలో ఓ హారర్ సినిమా తెరకెక్కుతోంది. 'స్కేరీ పిక్చర్' (ాఝతీఎ్ాఅఙ్బతీవ) పేరుతో రానున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై డి. సురేష్ బాబు నిర్మిస్తుండగా, ప్రముఖ హీరో కమ్ ప్రొడ్యూసర్ రానా దగ్గుబాటి కీలక భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు.న్యూఢిల్లీలో జరిగిన 'హారర్‌కాన్ ఇండియా' వేదికగా రానా ఈ సినిమా వివరాలను వెల్లడించగా, తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కంగనా రనౌత్ చివరిసారిగా 2009లో ప్రభాస్ సరసన పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఏక్ నిరంజన్' చిత్రంలో నటించారు. సరిగ్గా 17 ఏళ్ల తర్వాత ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండటంతో ఇది టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఇది ప్రముఖ తెలుగు దర్శకుడు రవిబాబు తెరకెక్కిస్తున్న హిందీ చిత్రంగా తెలుస్తోంది.

ఈ సినిమా ద్వారా రవిబాబు కూడా బాలీవుడ్ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు.

విభిన్నమైన హారర్, థ్రిల్లర్ చిత్రాలు తీయడంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న రవిబాబు దర్శకత్వంలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను 2027లో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.